మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDDAY 4-2-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 216 Issue: 216

04 ఫిబ్రవరి 2026 - బుధవారం, శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం - శిశిర ఋతువు, మాఘ మాసం - కృష్ణపక్షం, సూర్యోదయం - ఉ. 6:50, సూర్యాస్తమయం - సా. 6:09, తిథి తదియ రా. 12:14ం వరకు, తరువాత చవితి, సంస్కృత వారం, సౌమ్య వాసరః నక్షత్రం, పూర్వ ఫల్గుని(పుబ్బ) రా. 10:13 వరకు, తరువాత ఉత్తర ఫల్గుని(ఉత్తర), యోగం, అతిగండ రా. 1:06ం వరకు, కరణం, వనిజ మ. 12:24 వరకు, విష్టి రా. 12:14ం వరకు, వర్జ్యం, ఉ. 6:11 నుండి ఉ. 7:47 వరకు, దుర్ముహూర్తం, మ. 12:07 నుండి మ. 12:52 వరకు, రాహుకాలం, మ. 12:30 నుండి మ. 1:54 వరకు, యమగండం, ఉ. 8:15 నుండి ఉ. 9:40 వరకు, గుళికాకాలం, ఉ. 11:05 నుండి మ. 12:30 వరకు, బ్రహ్మముహూర్తం, తె. 5:14 నుండి ఉ. 6:02 వరకు, అమృత ఘడియలు, మ. 3:59 నుండి సా. 5:35 వరకు, అభిజిత్ ముహూర్తం, లేదు,
గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Pubilished From Jagitial
www.evarthalu.com

# రూపాయికి గిరాకీ!

డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ మంగళవారం 117 పైసలు ఎగబాకింది. ఫారెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి 1.28 శాతం బలపడి 90.32 వద్ద ముగిసింది. ఆసియా కరెన్సీల్లో అత్యంతగా బలపడ్డ కరెన్సీగా రూపాయి నిలిచింది.

ముంబై: భారత్-అమెరికా మధ్య ట్రేడ్ డీల్ కుదరడంతో రూపాయి బలపడిందని, గడిచిన రెండు నెలల్లో ఒకేరోజు ఇంతటి స్థాయిలో పెరగడం ఇదే తొలిసారని విశ్లేషకులు తెలిపారు. దేశీయ ఈక్విటీ మార్కెట్లు బలోపేతం కావడం కూడా రూపాయికి

- తరువాయి 2 వ పేజీలో...





# రూ.12.5 లక్షల కోట్లు లాభం

## సెన్సెక్స్ 2000 పాయింట్లు హైక్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పిన శుభవార్తతో మంగళవారం సూచీలు రాకెట్ వేగంతో పరుగులు పెట్టాయి. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న అమెరికాతో ట్రేడ్ డీల్‌పై స్పష్టత రావడంతో దలాల్ స్ట్రీట్‌లో బుల్ రంకెలేసింది. ఉదయం మార్కెట్ ప్రారంభమైనప్పటి నుంచి ముగిసే వరకు బుల్ రన్ కొనసాగింది. దీంతో సెన్సెక్స్ 2000 పాయింట్లకుపైగా లాభపడింది. నిఫ్టీ 50 ఇండెక్స్ 25,700 మార్క్‌పై ముగిసింది. అన్ని రంగాల స్టాక్స్ లాభపడ్డాయి. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల విలువ ఒక్కరోజే రూ.12.5 లక్షల కోట్లు పెరిగింది. ప్రస్తుతం కంపెనీల విలువ రూ.455 లక్షల కోట్ల నుంచి రూ.467.35 లక్షల కోట్లకు చేరింది.



# శత్రు క్షిపణులు.. తుత్తునియలు!

## డీఆర్డీవో ఎస్ఎఫ్డీఆర్ క్షిపణి పరీక్ష విజయవంతం

దేశ క్షిపణి వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా భారత్ మరో విజయం సాధించింది.

› 2

# నా మెడ కోశారు

## నేను చేసిన తప్పేమిటి?

### పార్టీని నమ్ముకున్నా అన్యాయమే.. కార్యకర్తలకు అండగా ఉండొద్దా?

### బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు 30 టికెట్లు.. నా వర్గానికి 20 టికెట్లేనా?

### మాజీమంత్రి జీవన్ రెడ్డి ఆగ్రహం.. జగిత్యాల మున్సిపల్ టిక్కెట్లపై నారాజ్

జగిత్యాల మున్సిపాలిటీలో టిక్కెట్ల కేటాయింపుపై పార్టీ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సంజయ్ వర్గానికి ఎక్కువ టిక్కెట్లు ఇచ్చారని ఆరోపించారు. ఎమ్మెల్యే వర్గానికి చెందిన 30 మందికి టిక్కెట్లు ఇచ్చారని, తన వర్గానికి చెందిన 20 మందికి మాత్రమే ఇచ్చారని మండిపడ్డారు.





జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 3 (ఈవార్తలు): తాజా చర్యతో తన మెడ కోసినట్లేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల పార్టీ నిర్ణయాలు తనను తీవ్రంగా కలిచివేశాయని అన్నారు. దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న వారికి అన్యాయం జరిగిందని వాపోయారు. పార్టీ రాష్ట్ర అగ్రనాయకత్వం ఎమ్మెల్యేకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ టికెట్ల కేటాయింపు అనంతరం పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున జీవన్ రెడ్డి నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. నాలుగు దశాబ్దాలుగా క్రమశిక్షణ గల కార్యకర్తగా పార్టీ కోసం పని చేస్తున్నట్లు చెప్పారు. నాలుగు దశాబ్దాల కాంగ్రెస్ పార్టీతో అనుబంధం ఉందన్నారు. నాలుగు దశాబ్దాలుగా ఎన్నో ఒడిదుడుకులు చూశామన్నారు. జగిత్యాలలో 2019 మినహా అన్ని మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసిందని గుర్తు చేశారు. ప్రవాహానికి ఎదురీతలో కూడా జగిత్యాల, రాయికల్ మున్సిపల్‌లో కార్యకర్తలు పట్టుదలతో పోటీ చేసి, కాంగ్రెస్ పార్టీకి అండగా నిల్చున్నారన్నారు. టీఆర్ఎస్ పాలనలో దశాబ్ద కాలం పోరాటం చేశామన్నారు. ప్రస్తుతం జగిత్యాల మున్సిపాలిటీలో 50 వార్డుల్లో కనీసం 40 గెలుపొందుతామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది.. కాబట్టి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు..టిక్కెట్లు ఆశించడం తప్పా? అంటూ హైకమాండ్‌పై

- తరువాయి 2 వ పేజీలో...



# సీఎం పుర ప్రచారం

### నేటి నుంచి జిల్లాల పర్యటన

### నేడు మిర్యాలగూడలో బహిరంగసభ

### ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు భూమిపూజ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. నియోజకవర్గ అభివృద్ధి పనులతో పాటు, ప్రతిష్టాత్మక విద్యా సంస్థల ఏర్పాటుకు ఆయన శ్రీకారం చుట్టనున్నారు. సీఎం పర్యటనకు సంబంధించి అధికార యంత్రాంగం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్' నిర్మాణానికి సీఎం భూమిపూజ చేయనున్నారు.

మిర్యాలగూడ, ఫిబ్రవరి 3 (ఈవార్తలు): సుమారు రూ.200 కోట్ల భారీ వ్యయంతో ఈ పాఠశాలను ఏర్పాటు చేయనున్నారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును చేపడుతున్నారు. పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి మహిళా సాధికారతపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. నియోజకవర్గంలోని పొదుపు సంఘాల (డ్వాక్రా) మహిళలకు భారీ ఎత్తున చెక్కులను పంపిణీ చేయనున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొంటారు. ఈ వేదిక ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, భవిష్యత్ కార్యాచరణపై ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. అక్కడి నుంచే మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. కాంగ్రెస్ శ్రేణులు సీఎంకు ఘన స్వాగతం పలికేందుకు సిద్ధమవుతున్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించాలని

- తరువాయి 2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,393 |
| వెండి (గ్రాము): | రూ.300 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,313 |

# ఉంటారా? పోతారా?

## భారత చట్టాలకు లొంగాల్సిందే

## వాట్సాప్‌కు సుప్రీం వార్నింగ్

న్యూఢిల్లీ: మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్‌పై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వాట్సాప్ గోప్యత విధానంపై సుప్రీం కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా వ్యక్తిగత గోప్యత ఉల్లంఘనల విషయంలో వాట్సాప్ తీరుపై అత్యున్నత న్యాయస్థానం ఫైర్ అయింది. ఈ దేశ ప్రజల గోప్యతతో ఆటలు ఆడుకునేందుకు అనుమతించబోమని తేల్చిచెప్పేసింది. ఈ మేరకు వాట్సాప్ తమ మాతృసంస్థ అయిన మెటాతో యూజర్ల డేటాను షేర్ చేసునేందుకు వీల్లేదని స్పష్టం చేసింది. 'మీరు మా దేశ గోప్యతతో ఆడుకోలేరు, మా డేటాలో ఒక్క అంకెను కూడా పంచుకోవడానికి మేము మిమ్మల్ని అనుమతించము' అని సీజేఐ సూర్యకాంత్ తేల్చిచెప్పారు. ఆ కంపెనీ దేశ చట్టాలను పాటించడంలో విఫలమైతే భారతదేశం వదిలి వెళ్లాల్సి ఉంటుందని కూడా హెచ్చరించారు. మన దేశంలో డేటా షేరింగ్, మార్కెట్ ఆధిపత్యానికి సంబంధించి గత నెలలో ఎన్సీఎల్టీ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ వాట్సాప్, మెటా, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్

- తరువాయి 2 వ పేజీలో...




# మా ఉత్తర్వులు అడ్డు కాదు: సుప్రీం

## గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపికపై క్లారిటీ

న్యూఢిల్లీ: తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల విషయం.. గత ప్రభుత్వ హయాం నుంచి ఎడతెగని సమస్యగానే మారింది. కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం.. గవర్నర్ కోటా కింద పంపించిన పేర్లను అప్పటి గవర్నర్ తిరస్కరించారు. ఆ తర్వాత రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత.. మరో ఇద్దరి పేర్లను సిఫార్సు చేయగా.. మొదట ఎంపిక చేసిన అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో.. ఈ గవర్నర్ కోటా ఎమ్మెల్సీల వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీంతో కాంగ్రెస్ సర్కార్ పంపించిన నియామకాలను రద్దు చేసిన సుప్రీంకోర్టు.. తమ తదుపరి ఉత్తర్వులకు లోబడే ఎమ్మెల్సీ స్థానాలను భర్తీ చేయాలని తేల్చి చెప్పగా.. తాజాగా తమ ఉత్తర్వులు ఎమ్మెల్సీల ఎంపికకు అడ్డంకి కాదని స్పష్టం చేసింది. ఎమ్మెల్సీ ఎంపిక విషయంలో సుప్రీంకోర్టు మరోసారి స్పష్టతను ఇచ్చింది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలను ఎంపిక చేసేందుకు తాము ఇచ్చిన ఉత్తర్వులు అడ్డంకిగా లేవని తేల్చి చెప్పింది. 2025 ఆగస్ట్ 13వ తేదీన ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల్లోనే ఇదే విషయాన్ని స్పష్టం చేసినట్లు తెలిపింది. రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా గవర్నర్ నిర్ణయం తీసుకోవచ్చని వెల్లడించింది. తన ఎన్నికపై ఇప్పటికే ఇచ్చిన ఉత్తర్వులు ఎత్తివేయాలని అమిర్ అలీ ఖాన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. దానిపై జస్టిస్ విక్రంనాథ్ నేతృత్వంలోని బెంచ్ విచారణ

- తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



ఆహారం చూసినా, తోటి శునకాలను చూసినా అంతగా స్పందించని కుక్కలు.. మనుషులతో మాత్రం గాఢంగా పెనవేసుకుపోతాయట. మనిషి వాసన చూడగానే వాటి మెదడు వెలిగిపోతున్నట్లుగా మారుతుందట. శునకాలకు ప్రపంచంలోనే అత్యంత ఫేవరెట్ తమ యజమానేనట.

# ఫైనల్‌కు ఢిల్లీ



### ఎలిమినేటర్‌లో గుజరాత్‌కు ఝలక్

### టైటిల్ పోరుకు నాలుగోసారి బరిలో

### రేపు ఫైనల్‌లో ఆర్సీబీతో అమీతుమీ

మహిళల ప్రీమియర్ లీగ్‌లో ఛాంపియన్ ట్యాగ్ కోసం నిరీక్షిస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్ నాలుగోసారి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఎలిమినేటర్‌లో గుజరాత్ జెయింట్స్‌ను ఓడగొట్టి టైటిల్ పోరుకు సిద్ధమైంది . ఢిల్లీ. 169 పరుగుల ఛేదనలో ఓపెనర్లు లిజెల్లే లీ(43), షఫాలీ వర్మ(31) అదిరే ఆరంభమివ్వగా.. జెమీమా రోడ్రిగ్స్(41) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో రెచ్చిపోయింది.

› 2

# బతుకులు బోల్తా

### ట్రాక్టర్ తిరగబడి నలుగురు కూలీలు దుర్మరణం

### జగిత్యాల జిల్లా మొగిలిపేటలో దారుణం

మల్లాపూర్ (జగిత్యాల జిల్లా), ఫిబ్రవరి 3 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో నలుగురు దుర్మరణం చెందారు. మల్లాపూర్ మండలం మొగిలిపేట వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి నీటి గుంటలో పడిపోయింది. ఈ ఘటనలో ట్రాక్టర్ ట్రాలీలో ప్రయాణిస్తున్న నలుగురు కూలీలు దుర్మరణం చెందారు. అందులో ముగ్గురు మహిళలు, బాలిక ఉన్నారు. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న మరికొందరు గాయపడ్డారు. వీరంతా పసుపు పంట కోతకు వెళ్లి తిరిగివస్తుండగా

- తరువాయి 2 వ పేజీలో...





# నిమ్స్‌లో నేడు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్

పంజాగుట్ట/హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఈవార్తలు): ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లోని మెడికల్ ఆంకాలజీ విభాగం బుధవారం ఉచిత క్యాన్సర్

- తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

4-2-2026

మేషం: ముఖ్యమైన వ్యవహారాలలో తొందరపాటు పడకూడదు. ఇంటాబయట చికాకులు పెరుగుతాయి. చేపట్టిన పనులలో శ్రమాధిక్యత పెరుగుతుంది. వృధా ప్రయాణాలు చెయ్యవలసి వస్తుంది. వ్యాపార, ఉద్యోగాలలో ఊహించని ఇబ్బందులు ఎదురవుతాయి. దైవ చింతన పెరుగుతుంది.

వృషభం: ఆప్తుల నుండి శుభవార్తలు అందుతాయి. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. సమాజంలో పలుకుబడి పెరుగుతుంది. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. సోదరులతో సఖ్యత కలుగుతుంది. వ్యాపార, ఉద్యోగాలు లాభసాటిగా సాగుతాయి.

మిధునం: దూర ప్రయాణాలలో ఊహించని మార్పులు కలుగుతాయి. కుటుంబ సమస్యలు కొంత చికాకు పరుస్తాయి. ఆర్థికంగా గందరగోళ పరిస్థితులు ఉంటాయి. పుణ్యక్షేత్ర సందర్శనం చేసుకుంటారు. వృత్తి వ్యాపారాలు కొంత నిరాశ పరుస్తాయి. ఉద్యోగాలలో అధికారులతో సమస్యలు కలుగుతాయి.

కర్కాటకం: దూర ప్రయాణాలలో కొత్త వ్యక్తుల పరిచయాలు కలుగుతాయి. చేపట్టిన పనుల్లో ఆశించిన పురోగతి కలుగుతుంది. ఆర్థిక విషయాలు సంతృప్తినిస్తాయి. సన్నిహితుల నుండి శుభవార్తలు వింటారు. వృత్తి వ్యాపారాలలో ఆశించిన లాభాలు అందుకుంటారు. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది.

సింహం: నిరుద్యోగులకు నూతన ఉద్యోగావకాశాలు లభిస్తాయి. విలువైన వస్తు లాభాలు పొందుతారు. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. వృత్తి వ్యాపారాలు సజావుగా సాగుతాయి. ఉద్యోగులకు హోదాలు పెరుగుతాయి.

కన్య: ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. ముఖ్యమైన పనులలో ఆటంకాలు కలుగుతాయి. చిన్ననాటి మిత్రులతో విభేదాలు పెరుగుతాయి. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు వాయిదా పడతాయి. వృత్తి వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు పెరుగుతాయి.

తుల: బంధుమిత్రులతో అకారణ వివాదాలు కలుగుతాయి. కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. చేపట్టిన వ్యవహారాలలో ఆటంకాలు తప్పవు. దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. పుణ్యక్షేత్రాలు సందర్శించుకుంటారు. వ్యాపార, ఉద్యోగాలలో ఒత్తిడి తప్పదు.

వృశ్చికం: విందు వినోద కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. దూరప్రాంత బంధుమిత్రుల నుంచి కీలక సమాచారం అందుతుంది. ఆర్థిక పరంగా ఆశించిన పురోగతి పెరుగుతుంది. వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. వృత్తి ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి.

ధనస్సు: అవసరానికి ధన సహాయం అంది దీర్ఘకాలిక ఋణాలు కొంత వరకు తీర్చగలుగుతారు. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. సన్నిహితుల నుంచి ఆశించిన సహాయ సహకారాలు అందుతాయి. వ్యాపారాలు గతం కంటే మెరుగ్గా ఉంటాయి. ఉద్యోగాలలో పని ఒత్తిడి నుండి ఉపశమనం కలుగుతుంది.

మకరం: బంధువులు, మిత్రులతో అకారణంగా విభేదాలు కలుగుతాయి. ఆర్థిక ఇబ్బందులు కొంత చికాకు పరుస్తాయి. ముఖ్యమైన పనులలో వ్యయప్రయాసలు అధికమౌతాయి. దూర ప్రయాణాలు వాయిదా వేస్తారు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపార, ఉద్యోగాలు నిరాశ కలిగిస్తాయి.

కుంభం: ఇంటాబయట చికాకులు పెరుగుతాయి. ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు అవసరం అవుతాయి. ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు. దూరప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. సోదరులతో అకారణ కలహ సూచనలు ఉన్నవి. వ్యాపారాలు, ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి.

మీనం: ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. విద్యార్థులు పోటీపరీక్షల్లో విజయం సాధిస్తారు. కీలక వ్యవహారాలు అప్రయత్నంగా పూర్తి చేస్తారు. సన్నిహితుల నుండి శుభవార్తలు అందుతాయి. వ్యాపారాలు సాఫీగా సాగుతాయి. ఉద్యోగులకు నూతన ప్రోత్సాహకాలు అందుతాయి.

# ఉంటారా? పోతారా?

మొదటి పేజీ తరువాయి



ఇండియా సహా పలువురు దాఖలు చేసిన అప్పీళ్లపై సుప్రీం విచారణ జరిపింది. ఇందులో కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా వాట్సాప్ వినియోగదారుల డేటా షేరింగ్ పై అభ్యంతరం తెలిపింది. దీంతో సీజేఐ సూర్యకాంత్.. టెక్ దిగ్గజాల వాదనలను తప్పుబట్టారు. వీధి వ్యాపారులు, గ్రామీణ పౌరులు సహా లక్షలాది మంది వినియోగదారులు సంక్లిష్టమైన గోప్యతా విధానాలను అర్థం చేసుకోలేరని గుర్తుచేశారు. డేటా షేరింగ్ ఉండదని హామీ ఇవ్వాలని, లేదంటే తామే కేసును కొట్టేస్తామని హెచ్చరించారు. వాట్సాప్ తరపు న్యాయవాది తమ గోప్యతా విధానం అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగా ఉందని వాదించగా, డేటా షేరింగ్ మాతృ సంస్థకే పరిమితం అని మెటా తెలిపింది. అయితే చాట్ ట్రెండ్‌ల ఆధారంగా ప్రకటనలతో సహా వినియోగదారు డేటా ప్రవర్తన, వాణిజ్య దోపిడీ వినియోగదారుల హక్కులను ఉల్లంఘిస్తుందని కోర్టు తెలిపింది. వైద్యులతో ప్రైవేట్ చాట్‌ల తర్వాత వినియోగదారులు ఔషధాల కోసం ప్రకటనలను అందుకున్న సందర్భాలను కూడా గుర్తుచేసింది. ఇది డేటా మానిటైజేషన్ పరిధిలోకి వస్తుందని తెలిపింది.

# మా ఉత్తర్వులు అడ్డు కాదు: సుప్రీం

మొదటి పేజీ తరువాయి

జరిపింది. అదే సమయంలో అమిర్ అలీ పిటిషన్‌ను దాసోజు శ్రవణ్ వేసిన ప్రధాన పిటిషన్‌తో కలిపి ఆదేశాలు ఇచ్చిన సుప్రీంకోర్టు.. తదుపరి విచారణను మార్చి 19వ తేదీకి వాయిదా వేసింది. 2023లో గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ కేబినెట్ నిర్ణయించి.. అప్పటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు సిఫార్సు చేశారు. వీరికి రాజకీయ పార్టీతో సంబంధాలు ఉన్నాయని.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 171 (5) పేర్కొన్న ప్రకారం సంబంధిత రంగాల్లో వీరికి ప్రతిభ లేదని పేర్కొంటూ.. వారిద్దరని నామినేషన్లను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తిరస్కరించారు. ఆ తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 2024లో ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ప్రొఫెసర్ కోదండరామ్, జర్నలిస్ట్ అమిర్ అలీఖాన్ పేర్లను ప్రభుత్వం సిఫార్సు చేయగా గవర్నర్ ఆమోద ముద్ర వేశారు. అయితే ఈ నియామకాలను సవాల్ చేసిన దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ.. మొదట తెలంగాణ హైకోర్టును ఆశ్రయించి.. ఆ తర్వాత సుప్రీంకోర్టుకు ఎక్కారు. ఈ పిటిషన్లపై గతేడాది ఆగస్ట్ 13వ తేదీన విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. కోదండరామ్, అమిర్ అలీ ఖాన్ ఎమ్మెల్సీ నియామకాలను రద్దు చేసింది. తమ తదుపరి ఉత్తర్వుల ఆధారంగా ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలను భర్తీ చేయాలని కోర్టు స్పష్టం చేసింది. ఇక తమ ఎన్నికపై జారీ చేసిన ఉత్తర్వులను ఎత్తివేయాలని అమిర్ అలీ ఖాన్ సుప్రీంకోర్టును కోరగా తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీలను ఎంపిక చేసేందుకు తమ ఉత్తర్వులు అడ్డంకిగా లేవని తాజాగా స్పష్టం చేసింది. అయితే ఖాళీ అయిన ఆ రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి మళ్లీ ప్రొఫెసర్ కోదండరామ్‌కే కేటాయించగా.. మరో స్థానాన్ని మాత్రం ప్రస్తుతం నేరుగా మంత్రి పదవి దక్కించుకున్న అజారుద్దీన్‌కు కేటాయిస్తూ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్సీల ఎంపికకు తమ ఉత్తర్వులు అడ్డంకి కావని పేర్కొనడం గమనార్హం.

# నా మెడ కోశారు

మొదటి పేజీ తరువాయి

విమర్శలు ఎక్కుపెట్టారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పని చేసి, కాంగ్రెస్ జెండా మోసిన వారి పేర్లను తాను ప్రతిపాదించానని, జాబితాను ఉత్తమ్ కుమార్ రెడ్డికి అందజేసినట్లు చెప్పారు. జగిత్యాల ఎమ్మెల్యే.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే.. పార్టీ ఫిరాయింపు చట్టం కింద నోటీసు ఇస్తే స్పీకర్‌కు తాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే అని అఫిడవిట్ ఇచ్చారని.. అలాంటి వ్యక్తి గాంధీ భవన్‌కు వచ్చినప్పుడూ నిలదీశానన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేను కూర్చోబెట్టుకొని మున్సిపల్ ఎన్నికల టికెట్లపై చర్చించడం ఏమిటి? ఎవరు క్రమశిక్షణ ఉల్లంఘిస్తున్నారు? అని ప్రశ్నించారు. దేశం అంతా రాజ్యాంగ పరిరక్షణ పాటుపడటమే కాంగ్రెస్ ధ్యేయం అని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారని.. కానీ రాష్ట్రంలో ఏం జరుగుతోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల హక్కులు కాపాడాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. అఖిల భారత కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, మీనాక్షి నటరాజన్ ఇక్కడ జరుగుతున్న పరిణామాలను పరిశీలించాలని గతంలో లిఖిత పూర్వకముగా లేఖ కూడా రాసినట్లు చెప్పారు. పార్టీ కోసం పనిచేసినవాళ్ల అవకాశాలను కాజేస్తే సహించేది లేదన్నారు. జీవితంలో ఒక్కసారి కూడా కాంగ్రెస్ పార్టీ జెండా పట్టని వారికి బీ ఫారం ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన కార్యకర్తలు ఏం కావాలన్నారు.





# నిమ్స్‌లో నేడు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్

మొదటి పేజీ తరువాయి

స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించనుంది. ఈ శిబిరంలో 30 - 60 ఏళ్ల వయస్సు గల మహిళలకు గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్, రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్, నోటి క్యాన్సర్ స్క్రీనింగ్ చేయనున్నారు. గుట్కా లేదా పాన్ నమిలే వ్యక్తులకు, అలాగే నోటి క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉన్న ధూమపానం చేసేవారికి ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తారు. స్క్రీనింగ్ సేవలు ఉదయం 10.30 నుండి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంటాయి. అలాగే క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నిమ్స్ డైరెక్టర్ నేతృత్వంలో భారీ ర్యాలీని చేపట్టనున్నారు.

# సీఎం 'పుర' ప్రచారం

మొదటి పేజీ తరువాయి

మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రచార వ్యూహాలపై మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రులతో సీఎం రేవంత్ సమావేశమయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించడంపై వారితో సమీక్షించారు. ఈ ఎన్నికల్లో విజయంపై నివేదికలన్నీ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగానే ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారికి సర్వే నివేదికలు అందజేశారు. అన్ని మున్సిపాలిటీల్లో గెలువబోతున్నామని జోస్యం చెప్పారు. అయినా ఎన్నికల చివరి వరకు అప్రమత్తంగా ఉండాలని జాగ్రత్తలు చెప్పారు. రెబల్స్ ఉంటే.. వారిని రాజీ చేయాలని ఆదేశించారు. మంత్రులందరూ జిల్లాలకు వెళ్లాలని సూచించారు. సర్వేల్లో వెనకబడిన మున్సిపాలిటీలను ఈ సందర్భంగా మంత్రులకు ఆయన సోదాహరణగా వివరించారు. ఎప్పటికప్పుడు జిల్లా ఇంఛార్జ్ మంత్రులతో సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రోజు వారి రిపోర్ట్ తనకు అందించాలని మంత్రులకు స్పష్టం చేశారు.

# శత్రు క్షిపణులు.. తుత్తునియలు!

### డీఆర్డీవో ఎస్ఎఫ్డీఆర్ క్షిపణి పరీక్ష విజయవంతం



పాట్నా: దేశ క్షిపణి వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా భారత్ మరో విజయం సాధించింది. భారత్ అమ్ముల పొదిలో మరో క్షిపణి వచ్చి చేరింది. గగనతలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే దీర్ఘశ్రేణి క్షిపణుల అభివృద్ధికి కీలకమైన 'సాలిడ్ ఫ్యూయల్ డక్టెడ్ రామ్‌జెట్' (ఎస్ఎఫ్డీఆర్) సాంకేతికతను డీఆర్డీవో విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరంలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్‌లో ఈ ప్రయోగాన్ని నిర్వహించింది. పరీక్షల్లో భాగంగా నాజిల్ లెస్ బూస్టర్, సాలిడ్ ఫ్యూయల్ డక్టెడ్ రామ్‌జెట్ మోటార్, ఫ్యూయల్ ఫ్లో కంట్రోలర్ వంటి అన్ని వ్యవస్థలూ ఆశించిన రీతిలో అత్యుత్తమ పనితీరును కనబరిచినట్లు శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. ఐటీఆర్ ఏర్పాటు చేసిన వివిధ ట్రాకింగ్ పరికరాల ద్వారా సేకరించిన డేటా ఆధారంగా ఈ పరీక్ష విజయవంతమైనట్లు శాస్త్రవేత్తలు ధ్రువీకరించారు. 'ఎస్ఎఫ్‌డీఆర్' ప్రొపల్షన్ వ్యవస్థ పరీక్ష విజయవంతంతో శత్రు దేశాల లక్ష్యాలను అత్యంత దూరం నుంచే అడ్డుకోగల క్షిపణుల తయారీ దిశగా భారత్ ముందడుగు వేసినట్లయ్యిందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

# బతుకులు బోల్తా

మొదటి పేజీ తరువాయి

ఈ విషాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంపై సమాచారం అందిన వెంటనే పోలీసులు, స్థానికులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో గాయపడినవారిని చికిత్స నిమిత్తం మెట్‌పల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో మరణించినవారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అయితే ఈ ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఘటనపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత విచారం వ్యక్తం చేశారు. ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని అన్నారు. ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# రూపాయికి గిరాకీ!

మొదటి పేజీ తరువాయి

ప్రోత్సాహాన్నిచ్చిందని వెల్లడించారు. అంతేకాక, క్రూడాయిల్ ధరలు బలహీనంగా ఉండటం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులు కుమ్మరించడం పెట్టుబడిదారుల్లో సెంటిమెంట్‌ను మెరుగుపరిచిందన్నారు. 90.30 వద్ద ప్రారంభమైన డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు ఇంట్రాడేలో 90.05 గరిష్ఠ స్థాయిని తాకగా, ఒక దశలో 90.52 కనిష్ఠ స్థాయిని కూడా తాకింది. చివరకు సోమవారం నాటి ముగింపుతో పోలిస్తే 117 పైసలు ఎగబాకి 90.32 వద్ద స్థిరపడింది. ఈ లెక్కన గడిచిన రెండు రోజుల్లో 161 పైసలు పెరిగింది.





# ఫైనల్‌కు ఢిల్లీ

మొదటి పేజీ తరువాయి

మహిళల ప్రీమియర్ లీగ్‌లో ఛాంపియన్ ట్యాగ్ కోసం నిరీక్షిస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్ నాలుగోసారి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఎలిమినేటర్‌లో గుజరాత్ జెయింట్స్‌ను ఓడగొట్టి టైటిల్ పోరుకు సిద్ధమైంది ఢిల్లీ. 169 పరుగుల ఛేదనలో ఓపెనర్లు లిజెల్లే లీ(43), షఫాలీ వర్మ(31) అదిరే ఆరంభమివ్వగా.. జెమీమా రోడ్రిగ్స్(41) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో రెచ్చిపోయింది. ఫిబ్రవరి 5న ఫైనల్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును ఢీకొట్టనుంది. లీగ్ దశలో గుజరాత్ జెయింట్స్ చేతిలో రెండుసార్లు ఓటమి చవిచూసిన ఢిల్లీ క్యాపిటల్స్ ఎలిమినేటర్‌లో గర్జించింది. తొలిసారి ఫైనల్ ఆడాలనుకున్న గుజరాత్ ఆశల్ని ఆడియాసలు చేసింది. బౌలర్ల కృషిని వృథా చేయకుండా బ్యాటర్లు దంచేయగా.. భారీ లక్ష్యాన్ని 16 ఓవర్లలోనే ఉఫ్‌మనిపించింది ఢిల్లీ. టాప్ క్లాస్ ఆటతో గుజరాత్‌కు చెక్ పెట్టిన ఢిల్లీ నాలుగోసారి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. భారీ ఛేదనలో ఓపెనర్లు లిజెల్లే లీ(43), షఫాలీ వర్మ(31) ఎడాపెడా బౌండరీలతో స్కోర్ బోర్డును ఉరికించారు. వీరిద్దరూ పోటాపోటీగా దంచగా.. పవర్ ప్లేలోనే 75 పరుగులు చేసింది ఢిల్లీ. వీరకొట్టుడుతో లక్ష్యాన్ని కరిగిస్తున్న ఈ ద్వయాన్ని ఎట్టకేలకు వరేహం విడదీసింది. డేంజరస్ లిజెల్లీ ఎల్బీగా ఔట్ కావడంతో గుజరాత్ ఊపిరిపీల్చుకుంది. అదే ఓవర్లో కట్ షాట్ ఆడబోయిన షఫాలీ క్లీన్‌బౌల్డ్ అయింది. అనంతరం లారా వొల్వార్డ్(32 నాటౌట్) జతగా జెమీమా రోడ్రిగ్స్(41) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడింది. ఢిల్లీని గెలుపువాకిట నిలిపిన జెమీమా విజయానికి 9 పరుగుల దూరంలో ఔటయ్యింది. మరిజానే కాప్ (4 నాటౌట్) లాంఛనం పూర్తి చేసింది. వరేహం వేసిన 16వ ఓవర్లో తను బౌండరీ కొట్టడంతో 7 వికెట్ల తేడాతో ఢిల్లీ జయభేరి మోగించి నాలుగోసారి ఫైనల్లో అడుగుపెట్టింది.



## విద్య, ఉద్యోగవాణి




### సీబీఎస్ఈ 10, 12వ తరగతి అడ్మిట్ కార్డులు విడుదల

సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) పది, 12వ తరగతి పరీక్షల అడ్మిట్ కార్డులు విడుదలయ్యాయి. ఫిబ్రవరి 17 నుంచి ఈ పరీక్షలు ప్రారంభం కానుండటంతో అధికారులు మంగళవారం హాల్‌టికెట్లను డౌన్‌లోడ్‌కు అందుబాటులోకి తెచ్చారు. పాఠశాలలు పరీక్ష సంగమ్ పోర్టల్‌లో లాగిన్ అయ్యి రెగ్యులర్ విద్యార్థుల అడ్మిట్ కార్డుల్ని డౌన్‌లోడ్ చేయొచ్చు. యూజర్ ఐడీ, పాస్‌వర్డ్, సెక్యూరిటీ పిన్ ఎంటర్ చేసి వీటిని పొందొచ్చు. అడ్మిట్ కార్డులో రోల్ నంబర్, పరీక్ష కేంద్రం పేరు, రిపోర్టు చేయాల్సిన సమయంతో పాటు విద్యార్థులకు పలు కీలక సూచనలు ఉంటాయి.

# ఒడిశాలో హైదరాబాద్ పీఐబీ బృందం

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (పీఐబీ): హైదరాబాద్‌లోని పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) ఆధ్వర్యంలోని ఆరుగురు సభ్యుల మీడియా ప్రతినిధుల బృందం సోమవారం ఒడిశాలోని భువనేశ్వర్‌లో ఐదు రోజుల పర్యటనను ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కీలక అభివృద్ధి పథకాలపై మీడియా బృందానికి అవగాహన కల్పించడంతో పాటు ఒడిశా సాంస్కృతిక, వారసత్వ ప్రాముఖ్యతను వెలుగులోకి తీసుకురావడం ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం. ఈ బృందానికి పీఐబీ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) అడిషనల్ డైరెక్టర్ జనరల్ అఖిల్ కుమార్ మిశ్రా, ఇతర అధికారులు ఘనస్వాగతం పలికారు. తొలి రోజు భువనేశ్వర్‌లోని పీఐబీ కార్యాలయాన్ని ప్రతినిధుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఏడీజీ అఖిల్ కుమార్ మిశ్రా ఒడిశాలోని మీడియా రంగం.. పీఐబీ, సీబీసీ చేపడుతున్న వివిధ ప్రచార, అవగాహన కార్యక్రమాల గురించి వివరించారు. రెండో రోజు సీఎస్ఐఆర్‌కు చెందిన మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్‌ను (సీఎస్ఐఆర్--ఐఎంఎంటీ) మీడియా బృందం సందర్శించింది. సంస్థ చేపడుతున్న పరిశోధనలు, ప్రయోగశాల సౌకర్యాలు, ఖనిజ- పదార్థ సాంకేతిక రంగాలలో అందిస్తున్న సహకారం గురించి అక్కడి శాస్త్రవేత్తలు మీడియా ప్రతినిధులకు వివరించారు. ప్రధాన శాస్త్రవేత్త కాళీ సంజయ్ మాట్లాడుతూ.. కీలకమైన ఖనిజాల రంగంలో భారత్‌ను స్వయంసమృద్ధిగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం



విధానపరమైన, వ్యూహాత్మక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కృషిలో సీఎస్ఐఆర్-ఐఎంఎంటీ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఒడిశా కళలు, సంస్కృతి, హస్తకళల గురించి తెలుసుకోవడానికి మీడియా బృందం 'కళా భూమి' మ్యూజియాన్ని సందర్శించింది. ఈ నెల 6 వరకు కొనసాగనున్న ఈ పర్యటనలో కేంద్ర ప్రభుత్వ సంస్థలు, సాంస్కృతిక వారసత్వ ప్రదేశాలను మీడియా బృందం సందర్శించనుంది.

## కేంద్ర పథకాలతో తెలంగాణకు భారీ లబ్ధి

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (పీఐబీ): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా తెలంగాణ ప్రజలు భారీగా లబ్ధి పొందుతున్నారు. అన్ని కేంద్ర పథకాల లబ్ధిదారుల్లో తెలంగాణ ప్రజల సంఖ్య గణనీయంగా ఉంది. కేంద్ర పథకాల అమలుతో తెలంగాణ ప్రజల జీవన ప్రమాణాలు, ఆర్థిక స్థితిగతులు మెరుగవుతున్నాయి.

**2026 జనవరి వరకు తెలంగాణలో కేంద్ర పథకాల అమలు పురోగతి, లబ్ధిదారుల వివరాలు:**

- పీఎం జన్‌ధన్ యోజన - మొత్తం ఖాతాలు: 1.32 కోట్లపైగా
- పీఎం జీవన్‌జ్యోతి బీమా యోజన - నమోదు: 92.4 లక్షలపైగా
- పీఎం సురక్షా బీమా యోజన - నమోదు: 1.92కోట్ల పైగా
- పీఎం ముద్ర యోజన - మొత్తం: రూ.86.8 వేల కోట్లపైగా
- అటల్ పెన్షన్ యోజన - మొత్తం లబ్ధిదారులు: 26.9 లక్షలపైగా
- పీఎం స్వనిధి - నిధులు విడుదలైన దరఖాస్తు: 7.61 లక్షలపైగా
- కిసాన్ క్రెడిట్ కార్డుల జారీ: 33.2 లక్షలపైగా
- జల్‌జీవన్ మిషన్: 53.9 లక్షలకు పైగా గ్రామీణ గృహాలకు నల్లా నీటి కనెక్షన్లు
- పీఎం ఉజ్వల యోజన: 11.8 లక్షలకు పైగా ఎల్‌పీజీ కనెక్షన్లు
- జన్ ఔషధి: 215కు పైగా జన్‌ఔషధి కేంద్రాలు ప్రారంభం
- ఆయుష్మాన్ కార్డులు: 82.7 లక్షలకు పైగా కార్డుల సృష్టి
- పీఎం గరీబ్ కల్యాణ్ అన్న యోజన: 192 లక్షలకు పైగా లబ్ధిదారులు
- పీఎం కిసాన్: 30.4 లక్షలకు పైగా రైతులకు సహాయం

## హైదరాబాద్‌లో హైడ్రా ఫైర్ సేఫ్టీ పాఠాలు

***ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ల వాడకం, భద్రతా చర్యలపై ప్రాక్టికల్ డెమోలు***

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలో ఇటీవల వరుసగా చోటుచేసుకుంటున్న అగ్ని ప్రమాదాల నేపథ్యంలో హైడ్రా అప్రమత్తమైంది. ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించే లక్ష్యంతో ప్రజల్లో అగ్ని భద్రతపై అవగాహన కల్పించేందుకు నగరం నలుమూలలా భారీ ఎత్తున ప్రత్యేక కార్యక్రమాలను ప్రారంభించింది. ముఖ్యంగా వాణిజ్య సముదాయాలు, జనసాంద్రత అధికంగా ఉండే ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఇటీవల నాంపల్లిలోని ఓ ఫర్నీచర్ షోరూంలో జరిగిన భారీ అగ్ని ప్రమాదంతో పాటు, నగరంలోని ఇతర ప్రాంతాల్లో జరిగిన ఘటనలు ఈ చర్యలకు ప్రధాన కారణంగా నిలిచాయి. చాలా వాణిజ్య భవనాల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలను పాటించడం లేదని అధికారులు జరిపిన తనిఖీల్లో వెల్లడైంది. ఈ నేపథ్యంలో, అగ్నిమాపక భద్రతా నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించేందుకు వాణిజ్య సంస్థలకు నెల రోజుల గడువు ఇస్తూనే, మరోవైపు ఈ అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా, అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఒకవేళ ప్రమాదం సంభవిస్తే మంటలను ఎలా అదుపులోకి తీసుకురావాలనే అంశాలపై వివరిస్తున్నారు. ముఖ్యంగా ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ల వినియోగం, మానవ ప్రమేయం లేకుండా మంటలను ఆర్పే ఆటోమేటిక్ వాటర్ స్ప్రింక్లర్లు, పొగను గుర్తించే స్మోక్ డిటెక్టర్ల పనితీరుపై ప్రాక్టికల్‌గా చూపిస్తూ అవగాహన కల్పిస్తున్నారు.

## పెళ్లి కావటం లేదని..

**హుస్సేన్ సాగర్ లో దూకి యువతి ఆత్మహత్య**

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఈవార్తలు): మతిస్థిమితం సరిగా లేని తల్లిని విడిచిపెట్టి వివాహం చేసుకోలేక.. తల్లిని తనతోనే ఉంచుకుంటానని ఆ యువతి కండీషన్ పెట్టింది. దీంతో వచ్చిన సంబంధాలన్నీ వెనక్కి వెళుతున్నాయి. ఇటీవల వచ్చిన మరో సంబంధం విషయంలోనూ అలాగే జరగడంతో ఆ యువతి మనస్తాపానికి గురైంది. ఇక తనకు వివాహం కాదేమోననే వేదనతో హుస్సేన్ సాగర్ లో దూకింది. సోమవారం యువతి మృతదేహం బయటపడడంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా కండ్లకోయకు చెందిన తోష్నివాల్ విజయలక్ష్మి(26) కూకట్ పల్లిలోని మైత్రీ నగర్ లో అద్దెకు ఉంటోంది. తండ్రి తన చిన్నతనంలోనే చనిపోగా.. మతిస్థిమితం లేని తల్లిని జాగ్రత్తగా చూసుకుంటోంది. ఓవైపు ఐటీ కంపెనీలో ఉద్యోగం చేస్తూ, మరోవైపు తల్లికి సేవలు చేస్తూ కాపాడుకుంటోంది. విజయలక్ష్మికి ఇటీవల పెళ్లి సంబంధాలు రాగా.. తల్లికి తాను తప్ప ఎవరూ లేరని, మతిస్థిమితం కూడా లేకపోవడంతో ఆమెను తానే దగ్గరుండి చూసుకుంటానని కండిషన్ పెట్టింది. దీంతో వచ్చిన సంబంధాలు ఏవీ కుదరలేదు. ఓవైపు పెళ్లి కుదరకపోవడం, మరోవైపు తల్లి అనారోగ్యంతో విజయలక్ష్మి మనస్తాపం చెంది కఠిన నిర్ణయం తీసుకుంది. శనివారం సాయంత్రం ఇంటినుంచి బయటకు వెళ్లిన విజయలక్ష్మి తిరిగి రాలేదు. హుస్సేన్ సాగర్ లో దూకి చనిపోయింది. సోమవారం ఉదయం ఆమె మృతదేహం నీటిపై తేలడంతో పోలీసులు పోస్ట్ మార్టం నిర్వహించి మార్చురిలో ఉంచారు.



# మేడారం జాతరపై దుష్ప్రచారం

**మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం**

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఈవార్తలు): ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం సమ్మక్క సారలక్క మహాజాతరకు సంబంధించి.. మంత్రి సీతక్క కీలక వ్యాఖ్యలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా.. అత్యంత వైభవంగా ఈసారి జాతరను నిర్వహించినట్లు హర్షం వ్యక్తం చేశారు. గతంలో నిర్వహించిన జాతరల కంటే ఈసారి మరింత మెరుగ్గా ఏర్పాట్లు చేశామని.. సమ్మక్క, సారలమ్మల ఆశీస్సులతో ఎలాంటి అసౌకర్యం కలగకుండా భక్తులు దర్శనాలు చేసుకున్నట్లు వివరించారు. ఈ జాతర ఇంతటి సక్సెస్ కావడం వెనుక ఉన్న అధికారులు, సిబ్బంది కృషిని మంత్రి కొనియాడారు. వారంతా సమన్వయంతో పనిచేసి.. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూశారని పేర్కొన్నారు. ఇక ఈ ఏడాది మేడారం జాతర.. అంచనాలకు మించి ఘనంగా జరిగినట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. క్లాస్, మాస్ అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు భారీగా తరలివచ్చి జాతరను విజయవంతం చేశారని పేర్కొన్నారు. దాదాపు రెండున్నర కోట్ల మంది భక్తులు.. సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్నట్లు ప్రాథమికంగా



భావిస్తున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. ఒకట్రెండు రోజుల్లో.. మేడారం తిరుగు జాతర నిర్వహణతో ఈ జాతర పూర్తిస్థాయిలో ముగుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా మేడారం జాతర ఏర్పాట్లపై జరుగుతున్న ప్రచారంపై మంత్రి స్పందించారు. కావాలనే కొందరు విష ప్రచారం చేసినట్లు తెలిపారు. ఒక చిన్న దొంగతనాన్ని పెద్దదిగా చేసి చూపిస్తూ.. జాతరలో సరైన ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వం విఫలం అయిందన్నట్లుగా సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ వ్యాప్తి చేశారని తీవ్రంగా ఆగ్రహించారు. కానీ కొందరు ప్రతిపక్ష నేతలు మాత్రం.. మేడారంలో చేసిన సౌకర్యాలు, సదుపాయాలను చూసి బాగున్నాయని ప్రశంసలు గుప్పించడం చాలా సంతోషకరమని మంత్రి సీతక్క తెలిపారు. ఇక మేడారం జాతరలో తాను చేసిన నృత్యంపై వచ్చిన విమర్శలకు ఆమె గట్టిగా కౌంటర్ ఇచ్చారు. ఆ నృత్యం తమ ఆదివాసీ సంస్కృతిలో ఒక భాగమని.. విదేశాల నుంచి వచ్చే వారు కూడా తమ నృత్యాలను ఇష్టపడి చేస్తున్నారని.. అలాంటప్పుడు తమ సొంత గడ్డపై.. తమ సంస్కృతిలో భాగంగా తాను నృత్యం చేయడంలో తప్పేముందని నిలదీశారు. ఇలా చేయడం తమ సంస్కృతి మూలాలకు, తమ వారికి ఇచ్చే గౌరవమని ఆమె స్పష్టం చేశారు. ఇక వచ్చే జాతర నాటికి మేడారంలో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు రాకుండా ఉండేందుకు చుట్టుపక్కల ఉన్న అన్ని రోడ్లను మరింత వెడల్పు చేస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. అదే సమయంలో త్వరలో జరగనున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి.. ములుగు జిల్లాలో చేపట్టాల్సిన పనులపై సంబంధిత అధికారులతో త్వరలోనే సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

# తెలంగాణలో జీరో రిక్రూట్‌మెంట్

**నిరుద్యోగులు క్షమించరు: కేటీఆర్**

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఈవార్తలు): రెండు లక్షల ఉద్యోగాలు మొదటి ఏడాదిలోనే అని ఇచ్చిన మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గుగా ముఖం చాటేసిన ముఖ్యమంత్రిని చూసి తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తెలంగాణభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని అడ్డదారిలో గద్దెనెక్కిన రేవంత్.. తీరా అది ఐదేళ్ల హామీ అని, పీసీసీ చీఫ్‌తో సీఎం పలికిస్తున్న చిలుక పలుకులు చూసి యువతరం ఛీకొడుతోందని అన్నారు. తొలి సంవత్సరమే రెండు లక్షల నియామకాలు చేపట్టకపోతే ప్రభుత్వాన్ని దించేయండని ఢిల్లీ నుంచి వచ్చి మరీ చెప్పిపోయిన ప్రియాంక గాంధీ మాట అమలై ఉంటే.. ఈ దగాకోరు సర్కారు కుప్పకూలి ఇప్పటికే ఏడాది పూర్తయ్యేదన్నారు కేటీఆర్. కేసీఆర్ హయాంలో చివరి దశలో ఉన్న 65 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇచ్చి ఫోటోలకు ఫోజులు కొట్టిన సీఎం, ఆ తరువాత మొత్తానికే చేతులెత్తేయడంతోనే తెలంగాణలో 'రిక్రూట్‌మెంట్ జీరో'గా మారిపోయిందని కాంగ్రెస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ఎండగట్టారు. అప్పటికే లక్షా 65 వేల ఉద్యోగాలను భర్తీ చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వంపై పనిగట్టుకుని రేవంత్ చల్లిన బురద అంతా అబద్ధాలతో అందలం ఎక్కడానికేనని అందరికీ అర్థమైపోయిందని,



పట్టుమని 10 వేల కొత్త ఉద్యోగాలకు కూడా నోటిఫికేషన్లు ఇవ్వని చేతకాని దద్దమ్మ పాలన చూసి నిరుద్యోగులే కాదు, వారి తల్లిదండ్రులు కూడా దుమ్మెత్తిపోస్తున్నారన్నారు. జాబ్ క్యాలెండర్‌కు పాతరేసి, వరుస కుంభకోణాలతో రేవంత్ సర్కారు జేబులు నింపుకుంటున్న తీరును నిత్యం తెలంగాణ సమాజం గమనిస్తూనే ఉందని, రెండు లక్షల ఉద్యోగాల హామీపై నాలుక మడతేసినంత మాత్రాన నాలుగు కోట్ల ప్రజలు ఊరుకుంటారని, ముఖ్యమంత్రి చేసిన మోసాన్ని మరిచిపోతారని అనుకుంటే అది పొరపాటే అని హెచ్చరించారు. తెలంగాణ నిరుద్యోగులను నమ్మించి నయవంచన చేసినందుకు ముఖ్యమంత్రి ముక్కున వేలేసుకుని క్షమాపణలు చెప్పినా, పొర్లుదండాలు పెట్టినా క్షమించే ప్రసక్తే లేదని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిరుద్యోగులకు, విద్యార్థులకు చేస్తున్న ఈ ద్రోహంపై వెంటాడుతామన్నారు. మేధావుల ముసుగు వేసుకుని మాయమాటలతో మభ్యపెట్టిన గొంతులన్నీ గత రెండేళ్ల నుంచి మూగబోయినంత మాత్రాన మీరు చేసిన పాపం ఊరికే పోదని, నిరుద్యోగులకు, యువతకు అండగా ఉండాల్సిన బాధ్యత ఉందన్నారు కేటీఆర్. కేవలం నిరుద్యోగులను మాత్రమే కాకుండా రాష్ట్రంలోని అన్ని వర్గాలను రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఇప్పటికే మూడు దఫాలుగా రైతుబంధు ఎగ్గొట్టి 70 లక్షల మంది అన్నదాతల పొట్టకొట్టారు. కేసీఆర్ పాలనలో ఆత్మగౌరవంతో బతికిన రైతన్నను మళ్లీ అప్పులపాలు చేసి తీరని ద్రోహం చేశారని తెలిపారు. సీఎం సీటుపై కూర్చున్న మరుక్షణంలోనే ప్రతి మహిళకు రూ.2500 ఇస్తానని చెప్పిన మాటలకు రెండేళ్లయినా ఒక్కరికీ దిక్కులేకపోవడంతో ఆడబిడ్డలు కోపంతో రగిలిపోతున్నారన్నారు. ఆరు గ్యారెంటీలన్నీ అక్షరాలా గారడీలేనని, 420 హామీలన్నీ నయవంచన మాత్రమేనని తన నిజస్వరూపాన్ని బయటపెట్టిన రేవంత్ సర్కారుకు నిరుద్యోగుల ఉసురు తగలడం ఖాయం అన్నారు. మెగా డీఎస్సీ పేరిట దగా, నిరుద్యోగ భృతి పేరిట చేసిన ద్రోహానికి గుణపాఠం చెప్పేందుకు ఆదిలాబాద్ నుంచి అశోక్ నగర్ చౌరస్తా వరకూ ప్రతి నిరుద్యోగి సిద్ధంగా ఉన్నాడని తెలిపారు. చైతన్యానికి ప్రతీకైన తెలంగాణ యువత సంఘటిత శక్తిలో ఉన్న బలం ఏంటో, వారు బిగించే పిడికిళ్లు కాంగ్రెస్ పునాదులను ఎలా పెకిలిస్తాయో త్వరలోనే చూస్తామని కేటీఆర్ తెలిపారు.

# త్వరలో హైదరాబాద్ రైల్వే హబ్

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి**

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ఈవార్తలు): హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2026-27 బడ్జెట్ ఎన్నికల కోసం కాకుండా వికసిత్ భారత్-2047 కోసం తీసుకువచ్చిన బడ్జెట్ అన్నారు. ఉచితాలు ప్రవేశపెట్టడం కోసమే బడ్జెట్ అన్నట్లుగా రాజకీయ పార్టీలు ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్ ఉందని అన్నారు. వీబీ జీ రామ్ జీ ద్వారా ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేశారని కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేయడం సరికాదని అన్నారు. ఈ పథకానికి బడ్జెట్‌లో 9 శాతం నిధులు కేటాయించినట్లు తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు 4.30 లక్షల ఇళ్లు కేటాయించామని, మేడారం జాతరకు కేంద్రం రూ.3.70 కోట్లు కేటాయించిందని అన్నారు. నైనీ బొగ్గు బొగ్గు గనుల వ్యవహారంలో తెలంగాణ మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దగా వల్లే సింగరేణి భ్రష్టు పట్టిందని ఆరోపించారు. సింగరేణిని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా కేసీఆర్ మార్చుకున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ తన ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మార్చుకుందని విమర్శించారు.



## విద్యాలయాలా? విషసర్పాల ఆవాసాలా?

**రాష్ట్ర ప్రభుత్వంపై మాజీమంత్రి హరీశ్ ఫైర్**

**గురుకులంలో విద్యార్థినికి పాము కాటు**



మహబూబాద్, ఫిబ్రవరి 3 (ఈవార్తలు): ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల సంగతి దేవుడెరుగు.. ఉన్న గురుకులాల పరిస్థితి అధ్వాన్నం చేశారని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. పాము కాటుకు గురై ఆస్పత్రిలో చేరిన గురుకుల విద్యార్థిని ప్రాణానికి పూర్తి బాధ్యత సీఎం రేవంత్ రెడ్డిదేనని అన్నారు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి గురుకులంలో ఇంటర్ విద్యార్థిని అశ్మిత పాముకాటుకు గురై మృత్యువుతో పోరాడుతుందన్న ఘటనపై ఎక్స్ వేదికగా స్పందించారు. విద్యార్థిని పాము కాటుకు గురైన వార్త తనను ఎంతో కలిచివేస్తోందన్నారు. రేవంత్ రెడ్డి గారు మీ పాలనలో గురుకులాలు విద్యా నిలయాలా..? లేదంటే విషసర్పాలకు ఆవాసాలా..? అని హరీష్ రావు ప్రశ్నించారు. సీఎంగా, విద్యాశాఖ మంత్రిగా ఇది మీ పరిపాలనా వైఫల్యం కాదా...? రూ.20 వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ అని చెబుతూ రంగుల లోకం చూపిస్తూ గురుకులాలను మీరు గాలికి వదిలేయడం సిగ్గుచేటన్నారు. గురుకులాల్లో పిచ్చి మొక్కలు తొలగించే దిక్కులేదు. చిమ్మచీకట్లో లైట్లు వేసే నాథుడు లేదు. అపరిశుభ్రత కారణంగా గురుకులాల్లో నేడు కుక్కకాట్లు, పాము కాట్లు సర్వసాధారణంగా మారిపోవడం అత్యంత దుర్మార్గమైన విషయమన్నారు. గురుకుల బిడ్డలకు కడుపునిండా తిండి లేదు.. ప్రాణాలకు రక్షణ లేదన్నారు. సీఎం హార్వర్డ్ యూనివర్సిటీకి వెళ్లి విదేశాల్లో ఫొటోలకు పోజులిస్తే ఇక్కడ పేద విద్యార్థులు ఆస్పత్రి పాలై కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## నన్ను కాదంటే సస్పెండ్ చేస్తాం

**రెబల్స్‌కు జగ్గారెడ్డి గట్టి హెచ్చరిక**

సంగారెడ్డి, ఫిబ్రవరి 3 (ఈవార్తలు): తెలంగాణలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అన్ని పార్టీలకు కూడా రెబల్స్ బెడద తప్పడం లేదు. ఈ క్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీ రెబల్స్ అభ్యర్థులకు హెచ్చరిక జారీ చేశారు. తనను, పార్టీ నిర్ణయాన్ని కాదని ఎవరైనా నామినేషన్ వేస్తే వారిని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. సంగారెడ్డి మున్సిపాలిటీలో అధికార కాంగ్రెస్ పార్టీకి ఎనిమిది వార్డుల్లో రెబల్స్ పోరు ఉంది. అయితే పార్టీ అధిష్ఠానం ఇప్పటికే అభ్యర్థులకు బీ-ఫామ్‌లు అందజేసింది. పోటీకి ఆసక్తి చూపుతున్న మిగిలిన అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకుని పార్టీ బీ-ఫామ్ ఇచ్చిన అభ్యర్థులకు సహకరించాలని జగ్గారెడ్డి సూచిస్తున్నారు.

## సోషల్ వాణి



### హ్యాపీ బర్త్ డే ఫేస్‌బుక్!

ఫేస్‌బుక్ ఫిబ్రవరి 4, 2026 నాటికి తన 22వ పుట్టినరోజును జరుపుకుంటోంది. 2004లో ఇదే రోజన మార్క్ జుకర్‌బర్గ్ హార్వర్డ్ యూనివర్సిటీ రూమ్‌మేట్స్‌తో కలిసి ద ఫేస్‌బుక్ పేరుతో దీన్ని ప్రారంభించారు. కాలేజీ విద్యార్థుల కోసమే మొదలైన ఈ సైట్, 2006లో 13 ఏళ్లు నిండిన అందరికీ అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సుమారు 300 కోట్లకు పైగా నెలవారీ యాక్టివ్ యూజర్లతో ఫేస్‌బుక్ ప్రపంచంలోనే అతిపెద్ద సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌గా నిలిచింది. 2021లో మాత్ర సంస్థ పేరును మెటాగా మారుస్తూ మార్క్ జుకర్‌బర్గ్ నిర్ణయం తీసుకున్నారు. 2006లో వచ్చిన న్యూస్ ఫీడ్, 2009లో వచ్చిన లైక్ బటన్ వంటివి ఫేస్‌బుక్ చరిత్రలో కీలక మైలురాళ్లుగా నిలిచాయి.



## ఎస్పీగా శేషాద్రిని రెడ్డికి పదోన్నతి

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 3 (ఈవార్తలు): జగిత్యాల అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి ఎస్పీగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ చేతుల మీదుగా పిప్పింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆమె భుజాలపై స్టార్ చిహ్నాన్ని అలంకరించి, అభినందించారు. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ ట్రాఫిక్ డీసీపీగా బదిలీ అయిన సందర్భంగా ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించాలని సూచించారు.

## భద్రకాళి అమ్మవారి సేవలో పవన్ సతీమణి

వరంగల్, ఫిబ్రవరి 3 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు పవన్ కల్యాణ్ భార్య అన్నా లెజినోవా భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. మంగళవారం వరంగల్ వచ్చిన ఆమె భద్రకాళి గుడికి వచ్చారు. అన్నా లెజినోవాకు ఆలయ ధర్మకర్తలు, పూజారులు ఘనస్వాగతం పలికారు. ఆదిశంకరాచార్యులు, వల్లభ గణపతిని దర్శించుకున్న అనంతరం ఆమె అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మండపంలో ప్రధాన అర్చకులు వెంకటనాగరాజు శర్మ, వేదపండితులు ప్రదీప్ కుమార్ శర్మ ఆమెకు ఆశీర్వాదం అందించి, అమ్మవారి శేషవస్త్రాలు బహూకరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## అదీ.. మోదీ మాస్టర్ క్లాస్

**భారత్-అమెరికా ఒప్పందంపై జేపీ ప్రశంసలు**

విజయవాడ, ఫిబ్రవరి 3 (ఈవార్తలు): భారత్, అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ హర్షం వ్యక్తం చేశారు. ఇది దేశానికి గొప్ప శుభవార్త అని పేర్కొంటూ, ఈ విజయం సాధించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. క్లిష్టమైన అడ్డంకులు ఎదురైనప్పటికీ, ప్రధాని మోదీ ఎంతో సంయమనంతో వ్యవహరించి జాతీయ ప్రయోజనాలను కాపాడారని ఆయన ప్రశంసించారు. ఈ ఒప్పందంపై జేపీ స్పందిస్తూ, "తీవ్రమైన సవాళ్ల నడుమ జాతీయ ప్రయోజనాలను ప్రోత్సహించడం, ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థతో స్నేహాన్ని కాపాడుకోవడం, అదే సమయంలో జాతీయ గౌరవాన్ని నిలబెట్టడం వంటి అంశాలలో ప్రధాని మోదీ ఒక మాస్టర్ క్లాస్ ప్రదర్శించారు" అని కొనియాడారు. భారత్, అమెరికా దేశాలు సహజ మిత్రపక్షాలని, ఈ వాణిజ్య ఒప్పందం ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను మరింత పటిష్టం చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ఒప్పందంతో వచ్చిన నూతనోత్సాహంతో దేశం సమ్మిళిత ఆర్థిక వృద్ధి, శ్రేయస్సు దిశగా మరింత పటిష్టంగా ముందుకు సాగవచ్చని జేపీ ఆకాంక్షించారు. ఇకపై ఒక దేశంగా మనమంతా అసంపూర్తిగా మిగిలిపోయిన ఎజెండాపై దృష్టి సారించి, అభివృద్ధి పథంలో పయనించాలని ఆయన పిలుపునిచ్చారు.

## 2029లో రిటర్న్ గిఫ్ట్ ఇస్తాం: అనిల్ కుమార్ యాదవ్

విజయవాడ, ఫిబ్రవరి 3 (ఈవార్తలు): వైసీపీ నేతలపై దాడులకు పాల్పడుతూ కూటమి నేతలు ఆటవిక పాలనకు తెరలేపారని మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. ఏపీని రావణకాష్టంగా మార్చారని మండిపడ్డారు. మరో మూడేళ్ల పాటు ఆటవిక పాలనను భరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. 2029లో రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని అన్నారు. కాపు, బీసే నేతలపై దాడులకు పాల్పడుతున్నారని అనిల్ విమర్శించారు. తిరుమల లడ్డూ గురించి దుష్ప్రచారం చేసి అడ్డంగా దొరికేశారని... దాన్నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు వైసీపీ నేతలపై దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫ్రస్టేషన్ లో ఉన్నారని ఎద్దేవా చేశారు. కూటమి నేతలకు దమ్ముంటే పోలీసు వ్యవస్థను పక్కన పెట్టి సవాలు విసరాలని ఛాలెంజ్ చేశారు.

## ఏపీలో రాష్ట్రపతి పాలన విధించండి

**పార్లమెంటు వద్ద వైసీపీ ఎంపీల నిరసన**

న్యూఢిల్లీ: పార్లమెంట్ ఎదుట వైసీపీ ఎంపీలు ప్లకార్డులు చేతపట్టి ఆందోళనకు దిగారు. ఏపీలో ఆటవిక పాలన కొనసాగుతోందని వారు నినాదాలు చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని... అవసరమైతే ఏపీలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేశ్ ల నివాసాలపై దాడుల నేపథ్యంలో వైసీపీ ఎంపీలు ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇప్పటికే కేంద్ర హోం శాఖ కార్యదర్శిని కలిసి పరిస్థితిని వివరించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కూడా కలిసి పరిస్థితులను ఆయనకు వివరించాలని వైసీపీ భావిస్తోంది.

## నేడు అంబటి కుటుంబానికి జగన్ పరామర్శ

గుంటూరు, ఫిబ్రవరి 3 (ఈవార్తలు): వైసీపీ అధినేత జగన్ బుధవారం గుంటూరులో పర్యటించబోతున్నారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబాన్ని జగన్ పరామర్శించనున్నారు. ఇప్పటికే ఫోన్ ద్వారా వారిని జగన్ పరామర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అంబటి ఇంటిపై టీడీపీ శ్రేణులు దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. అక్కడున్న వాహనాలను ధ్వంసం చేసి, ఆయన ఇంటికి నిప్పు పెట్టారు. మరోవైపు, సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అంబటిపై కేసు నమోదయింది. ఈ కేసులో అంబటికి మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారు. ప్రస్తుతం ఆయన రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే గుంటూరులోని అంబటి నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను జగన్ పరామర్శించనున్నారు.

## ఏపీని రావణకాష్ఠం చేయాలనుకుంటున్నారా?: బొత్స

వైజాగ్, ఫిబ్రవరి 3 (ఈవార్తలు): ఏపీని రావణకాష్ఠంగా చేయాలనుకుంటున్నారా? అంటూ ఏపీ శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రభుత్వం తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి అంబటి రాంబాబుపై జరిగిన దాడిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు దగ్గరుండి దాడి చేయిస్తారా? వైసీపీకి కార్యకర్తలు లేరని అనుకుంటున్నారా? అంటూ మండిపడ్డారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ .. చంద్రబాబు నాయుడు అప్రతిష్టను మూటకట్టుకోవద్దని హితవు పలికారు. గత మూడు రోజులుగా కూటమి ప్రభుత్వం విధ్వంసానికి పాల్పడుతోందని ఆరోపించారు. వైసీపీ నేతలపై జరుగుతున్న దాడుల విషయంలో జనసేన, బీజేపీ నాయకులు ఎందుకు తప్పును తప్పు అని చెప్పడం లేదని బొత్స నిలదీశారు. తనను దుర్భాషలాడటం వల్లే రాంబాబు స్పందించారని తెలిపారు. అనంతరం ఇంటికి వచ్చి తాను మాట్లాడింది తప్పేనని అంగీకరించారని, అయినా కేంద్ర మంత్రి తడాఖా చూపిస్తామని మాట్లాడటం సరికాదన్నారు. ఎన్‌డీడీబీ రిపోర్ట్‌ను వైసీపీ తెచ్చిందా? అని బొత్స ప్రశ్నించారు. హిందువుల మనోభావాలతో ఆడుకోవడం న్యాయమా? అని ప్రశ్నించారు. తప్పు చేసిన వారిని దేవుడు కూడా క్షమించడని, ఎవరైనా సరే ఫలితం అనుభవించాల్సిందేనని అన్నారు.



## అంగరంగ వైభవంగా ఎలమ్మ పట్నం

మల్యాల, ఫిబ్రవరి 3 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలకేంద్రంలో రేణుక మాత ఎల్లమ్మ పట్నం అంగరంగ వైభవంగా జరిగింది. గత పది రోజులనుండి ప్రతి వాడ జోగెత్తగా.. మంగళవారం చివరి రోజు సందర్భంగా పెద్ద ఎత్తున మహిళలు అమ్మవారికి బోనమెత్తి మొక్కులు చెల్లించారు. అమ్మవారికి పట్నం వేసి కల్యాణం జరిపించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు పొన్నం శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు బావు సంతు గౌడ్, గౌడ సంఘం పాలకవర్గం, కులస్థులు పాల్గొన్నారు.

# విడదల రజనిపై కేసు నమోదు

యడ్లపాడు, ఫిబ్రవరి 3 (ఈవార్తలు): ఏపీలో వైసీపీ నేతలపై వరుసగా కేసులు నమోదవుతున్నాయి. తాజాగా మాజీ మంత్రి విడదల రజనిపై కేసు నమోదయింది. యడ్లపాడు పోలీసులు ఆమెపై కేసు నమోదు చేశారు. ఆమెతో పాటు మరో 21 మంది వైసీపీ నేతలపై కూడా కేసు నమోదయింది. కేసు వివరాల్లోకి వెళితే... గత నెల 30న యడ్లపాడులోని దేవస్థానానికి తన అనుచరులతో పాటు విడదల రజని వెళ్లారు. తిరుమల లడ్డూలో కల్తీ జరగలేదని చెపుతూ... ఆలయాన్ని శుద్ధి చేయడానికి ఆమె యత్నించారు. అయితే, ఆలయంలోకి వెళ్లకుండా టీడీపీ నేతలు ఆమెను అడ్డుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో లోపలకు వెళతామని వైసీపీ నేతలు పట్టుబట్టడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు వైసీపీ నేతలకు సర్దిచెప్పి వెనక్కి పంపించారు. ఈ క్రమంలో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ప్రవర్తించారంటూ విడదల రజని, ఆమె అనుచరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా అంబటి రాంబాబు, జోగి రమేశ్ లపై కూడా పోలీసు కేసులు నమోదైన సంగతి తెలిసిందే. చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు అంబటిపై... నారా లోకేశ్ పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు జోగి రమేశ్ పై కేసులు నమోదయ్యాయి. అంబటికి మేజిస్ట్రేట్ రిమాండ్ కూడా విధించారు.

### కేసులు పెడుతున్నారు.. జాగ్రత్త!

**తనపై కేసు పెట్టినవారికి విడదల రజనీ వార్నింగ్**



కేసు నమోదైన తర్వాత రజని మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. తిరుమల లడ్డూలో కల్తీ జరగలేదని... ఆ విషయంలో క్షమాపణ చెప్పాలని వైసీపీ అడుగుతున్నందున చంద్రబాబు హింసను రాజేస్తున్నారని మండిపడ్డారు. అంబటి రాంబాబు, జోగి రమేశ్ పై ఒక ప్లాన్ ప్రకారమే దాడి చేస్తున్నారని విమర్శించారు. అంబటి రాంబాబు ఇంటి మీదకు మళ్లీ వస్తాం... మళ్లీ కొడతామని ఎమ్మెల్యే మాధవి అంటున్నారని రజని మండిపడ్డారు. అసలు మీ పార్టీలో మీ పరిస్థితి ఏమిటో చూసుకోవాలని అన్నారు. అంబటి రాంబాబుకు సినిమా చూపిస్తామని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వార్నింగ్ ఇస్తున్నారని... రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఎక్కడకు వెళుతోందని ప్రశ్నించారు. తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలవలేదని సీబీఐ చెప్పిందని తెలిపారు. చంద్రబాబుకు మంచి బుద్ధి ఇవ్వాలని పూజలు చేసేందుకు వెళితే... తనపై, తన అనుచరులపై ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు దాడి చేయించారని రజని ఆరోపించారు. తమపై దాడి చేసి, తమపైనే కేసులు పెట్టించారని దుయ్యబట్టారు. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ... చట్టాలను చంద్రబాబు చేతిలోకి తీసుకున్నారని విమర్శించారు. వైసీపీ నేతల ఇళ్లపై దాడి చేస్తున్నారని... మహిళలపై కూడా దాడులకు తెగబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ మహిళ అయిన తనపై అనేక సార్లు దాడులు చేశారని రజని మండిపడ్డారు. మాజీ మంత్రి అయిన తన పరిస్థితే ఇలా ఉంటే... సామాన్య మహిళల పరిస్థితి ఏమిటని అన్నారు.

# నెయ్యి కల్తీపై ఏపీ కేబినెట్ సీరియస్

అమరావతి, ఫిబ్రవరి 3 (ఈవార్తలు): కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం తయారీలో నెయ్యి కల్తీ వ్యవహారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని రాష్ట్ర కేబినెట్ తీవ్రంగా స్పందించింది. మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఇతర అజెండా అంశాలను పక్కనపెట్టి, కేవలం ఈ అంశంపైనే సుమారు మూడున్నర గంటల పాటు సుదీర్ఘంగా చర్చించింది. కోట్లాది మంది హిందువుల మనోభావాలతో ముడిపడిన ఈ వ్యవహారంలో దోషులు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోవాలని, తిరుమల పవిత్రతను కాపాడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని కేబినెట్ అభిప్రాయపడింది. సీబీఐ సిట్ ఇచ్చిన నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టేందుకు ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని కీలక నిర్ణయం తీసుకుంది. సమావేశం అనంతరం మంత్రులు కొలుసు పార్థసారథి, పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్ మీడియా సమావేశంలో కేబినెట్ చర్చల వివరాలను వెల్లడించారు. ఈ అంశంపై రాజకీయ ప్రయోజనాలు ఆశించడం లేదని, కేవలం భక్తుల మనోభావాలను గౌరవిస్తూ, శ్రీవారి క్షేత్ర పవిత్రతను



పునరుద్ధరించడమే తమ లక్ష్యమని మంత్రులు స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహా మంత్రులందరూ ఈ అంశంపై తమ అభిప్రాయాలను నిర్మొహమాటంగా వెల్లడించారని తెలిపారు. మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ, "కోట్లాది మంది హిందువులు ఆరాధించే ఏడుకొండలవాని సన్నిధిలో జరిగిన ఈ మహాపాపం గురించి సీబీఐ ఇచ్చిన నివేదికపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. హిందువుల మనోభావాలను, తిరుమల పవిత్రతను కాపాడటానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై మంత్రులందరూ అభిప్రాయాలు తెలిపారు. సీబీఐ ఛార్జ్‌షీట్ దాఖలు చేసినప్పటికీ, కోర్టు ఇంకా కాగ్నిజెన్స్ లోకి తీసుకోలేదు. అయితే, గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ తప్పిదాలను సరిదిద్దేందుకు, బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది," అని అన్నారు.



## 26 నుండి శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు

తిరుమల, ఫిబ్రవరి 3 (ఈవార్తలు): తిరుమలలో శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు ఫిబ్రవరి 26 నుండి మార్చి 02వ తేదీ వరకు జరుగనున్నాయి. రాత్రి 7 నుండి 8 గంటల వరకు పుష్కరిణిలో స్వామి, అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. ఈ మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం ఓ ప్రకటన విడుదల చేసింది. ఇకపోతే శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాల్లో భాగంగా తొలిరోజు ఫిబ్రవరి 26న శ్రీ సీత లక్ష్మణ ఆంజనేయ సమేతంగా శ్రీరామచంద్రమూర్తి తెప్పలపై పుష్కరిణిలో మూడు చుట్లు తిరిగి భక్తులకు కనువిందు చేస్తారు. రెండవ రోజు ఫిబ్రవరి 27న రుక్మిణీ సమేతంగా శ్రీకృష్ణస్వామి తెప్పలపై మూడుసార్లు విహరిస్తారు. మూడవరోజు ఫిబ్రవరి 28న శ్రీభూ సమేతంగా మలయప్పస్వామివారు మూడుసార్లు పుష్కరిణిలో చుట్టి భక్తులను అనుగ్రహిస్తారు. ఇదేవిధంగా శ్రీమలయప్పస్వామివారు నాలుగో రోజు మార్చి 1న ఐదుసార్లు, చివరి రోజు మార్చి 2వ తేదీ ఏడుసార్లు తెప్పపై పుష్కరిణిలో విహరించి భక్తులను కటాక్షిస్తారు. తెప్పోత్సవాల కారణంగా ఫిబ్రవరి 26,27 తేదీల్లో సహస్రదీపాలంకార సేవ, ఫిబ్రవరి 28న, మార్చి 1, 2వ తేదీల్లో ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

## పాత నేరస్తుల్ని పట్టించిన రోబో పోలీస్

**విశాఖ రైల్వే స్టేషన్‌లో సంచలనం**

**ఫేషియల్ రికగ్నిషన్‌తో నిందితుల గుర్తింపు**

వైజాగ్, ఫిబ్రవరి 3 (ఈవార్తలు): విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో భద్రతా విధుల్లో ఉన్న 'ఏఎస్‌సీ అర్జున్' అనే హ్యూమనాయిడ్ రోబో తన సత్తా చాటింది. దేశంలోనే తొలిసారిగా ప్రవేశపెట్టిన ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత రోబో, ఇద్దరు పాత నేరస్థులను గుర్తించి, వారిని పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం, సోమవారం రాత్రి 8.10 గంటల సమయంలో స్టేషన్ ప్రాంగణంలో 'అర్జున్' విధుల్లో ఉంది. అప్పటికే నేరస్థుల వివరాలు, ఫొటోలను రోబోలో అప్‌లోడ్ చేసి ఉంచారు. స్టేషన్‌లో తిరుగుతున్న ఇద్దరు అనుమానితులను రోబో తన కెమెరాతో చిత్రీకరించి, ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ ద్వారా పాత నేరస్థులుగా గుర్తించింది. వెంటనే ఈ సమాచారాన్ని, సీసీటీవీ ఫుటేజీ వివరాలను కంట్రోల్ రూమ్‌కు పంపింది. రోబో నుంచి సమాచారం అందుకున్న హెడ్ కానిస్టేబుల్ బీఎస్. నారాయణ, ఎస్సై వి. కీర్తి రెడ్డి నేతృత్వంలోని బృందాన్ని అప్రమత్తం చేశారు. పోలీసులు వెంటనే స్పందించి శివ, బంగారు అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ప్రయాణ టికెట్లు కూడా లేవని గుర్తించారు. విచారణలో వీరిద్దరిపై రాయగడ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులు ఉన్నట్లు తేలింది. దీంతో కేసు నమోదు చేసి, రాయగడ పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై రైల్వే డివిజనల్ మేనేజర్ (డీఆర్ఎం) లలిత్ బోహ్రా స్పందిస్తూ, పాత నేరస్థులను గుర్తించడంలో ఏఐ ఆధారిత రోబో సేవలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని అన్నారు. భవిష్యత్తులో నేర నియంత్రణలో ఇలాంటి టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.





## పొన్నం బామ్మర్దికి దక్కని టికెట్

**అడ్డుపడ్డ స్థానికేతర నినాదం**

**రెబల్‌గా బరిలోకి దిగే చాన్స్**

జనగామ, ఫిబ్రవరి 3 (ఈవార్తలు): జనగామ మున్సిపల్ ఎన్నికల బరిలో నిలవాలనుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ బావమరిది పెద్ది నవీన్ కుమార్ గౌడ్‌కు చుక్కెదురైంది. 6వ వార్డు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి, మున్సిపల్ ఛైర్మన్ పీఠం దక్కించుకోవాలని ఆయన వేసిన ప్లాన్ తలకిందులైంది. సోమవారం విడుదలైన అభ్యర్థుల తుది జాబితాలో నవీన్ పేరు లేకపోవడంతో ఆయన అనుచరులు షాక్‌కు గురయ్యారు. మంత్రి పొన్నం ప్రభాకర్ భార్యకు తమ్ముడైన నవీన్ కోసం స్వయంగా మంత్రి, టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గట్టిగానే ప్రయత్నించినట్లు సమాచారం. అయితే, నవీన్ 'స్థానికేతరుడు' (హనుమకొండకు చెందిన వ్యక్తి) అంటూ స్థానిక కాంగ్రెస్ నేతలు తీవ్రంగా అభ్యంతరం చెప్పారు. నవీన్‌కు టికెట్ ఇవ్వొద్దంటూ సంతకాల సేకరణ చేపట్టి మరీ అధిష్ఠానానికి పంపారు. స్థానికుల ఒత్తిడికి తలొగ్గిన ఎంపిక కమిటీ చివరకు బుక్క బాల భరద్వాజ్‌ను 6వ వార్డు అభ్యర్థిగా ఖరారు చేసింది. గతంలో రెండుసార్లు పార్టీ కోసం త్యాగం చేసి నామినేషన్లు ఉపసంహరించుకున్న బాల భరద్వాజ్‌కే గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని కమిటీ భావించింది. టికెట్ నిరాకరణతో నవీన్ కుమార్ గౌడ్ తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. ఆయన తండ్రి, రైస్ మిల్లర్ల అసోసియేషన్ నేత వెంకటనారాయణ గౌడ్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. పార్టీ టికెట్ ఇవ్వకపోయినా స్వతంత్ర అభ్యర్థిగానైనా లేదా మరో పార్టీ తరపునైనా నవీన్‌ను బరిలోకి దించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే జనగామ 6వ వార్డులో కాంగ్రెస్ అధికారిక అభ్యర్థికి గట్టి పోటీ తప్పదు. జనగామ మున్సిపాలిటీలో మొత్తం 30 వార్డులకు గానూ కాంగ్రెస్ 26 స్థానాల్లో పోటీ చేస్తోంది. పొత్తులో భాగంగా సీపీఎంకు 3, సీపీఐకి 1 వార్డు కేటాయించారు. టికెట్లు రాని మరికొంతమంది అసమ్మతి నేతలతో మంత్రి పొన్నం ప్రభాకర్ చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. నవీన్ కుమార్ గౌడ్ ఒకవేళ ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తే, మంత్రి కుటుంబంలోనే రాజకీయ విభేదాలు బయటపడే అవకాశం ఉంది.

# ఎన్నాళ్లీ బఫర్ జోన్లు?

## కేంద్రాన్ని నిలదీసిన అసదుద్దీన్

### చైనా విషయంలో భయపడుతోందని ఘాటు విమర్శ



**న్యూఢిల్లీ:** ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, చైనా విషయంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధానమంత్రి కార్యాలయాన్ని (పీఎంఓ) ట్యాగ్ చేస్తూ సోషల్ మీడియా వేదికగా ఆరు సూటి ప్రశ్నలు సంధించారు. లడఖ్ సరిహద్దుల్లో చైనా దూకుడు, బఫర్ జోన్ల ఏర్పాటు, మౌలిక సదుపాయాల నిర్మాణం వంటి కీలక అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీశారు. ఒవైసీ తన ప్రశ్నల్లో, "చైనాతో ఎలాంటి ఒప్పందం కుదుర్చుకున్నారు? ఏప్రిల్ 2020కి ముందు మన సైన్యం పెట్రోలింగ్ నిర్వహించిన అన్ని ప్రాంతాల్లో ఇప్పుడు గస్తీ కాయగలదా? ఒకవేళ లేకపోతే, దానికి కారణమేంటి? ఈ బఫర్ జోన్లు ఎంతకాలం కొనసాగుతాయి?" అని ప్రభుత్వాన్ని నిలదీశారు. అంతేకాకుండా, "చైనాను చూసి ఎందుకు అంతగా భయపడుతున్నారు? చైనా సరిహద్దుల్లో కాల్పులు జరపకుండా మన సైన్యంపై ఇన్ని ఆంక్షలు ఎందుకు విధించారు? వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ)పై చైనా అవగాహననే బఫర్ జోన్లకు ప్రామాణికంగా మార్చారు" అని ఆయన తీవ్రంగా ఆరోపించారు. గత డిసెంబర్‌లో వచ్చిన 'ది ఎకానమిస్ట్' మ్యాగజైన్‌ను ప్రస్తావిస్తూ ఒవైసీ కేంద్రంపై విమర్శలు గుప్పించారు. "మీ ప్రభుత్వమే ఆ విదేశీ జర్నలిస్టును లడఖ్‌కు తీసుకెళ్లింది. 2020 నుంచి లడఖ్ సరిహద్దుల్లో చైనా మౌలిక సదుపాయాల అభివృద్ధి రెట్టింపు అయిందని ఆ కథనం పేర్కొంది. మనకంటే నాలుగు రెట్లు వేగంగా చైనా నిర్మాణాలు చేపడుతోందని కూడా తెలిపింది. ఇదంతా జరుగుతుంటే మనం ఎలా అనుమతిస్తున్నాం?" అని ఒవైసీ ప్రశ్నించారు. అంతర్జాతీయ సంబంధాలపైనా ఆయన స్పందించారు. "పాకిస్థాన్‌కు చైనా అందిస్తున్న సైనిక సహకారాన్ని మీరు ఆపగలిగారా? ఒకవేళ ఆపలేకపోతే, చైనాతో మన స్నేహం వల్ల ప్రయోజనం ఏంటి?" అని ప్రశ్నించారు. చివరగా, పార్లమెంటు పనితీరుపై కూడా ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "ఈ కీలక అంశంపై ప్రతిపక్షాలు ప్రశ్నలు అడిగే అవకాశం లేకుండా పార్లమెంటును సజావుగా సాగనివ్వడం లేదని నేను భావిస్తున్నాను. రేపు సభలో గందరగోళం మధ్య పీఎంఓ నుంచి ఒక ప్రకటన వెలువడుతుంది అనుకుంటా" అని పేర్కొన్నారు. "ప్రభుత్వం తనకు సరైనదని భావించినదాన్ని కాకుండా, దేశానికి, ప్రజలకు ఏది మంచో అది చేయాలి" అని హితవు పలికారు. ఒవైసీ ప్రశ్నలు జాతీయ భద్రత, విదేశాంగ విధానంపై మరోసారి రాజకీయ చర్చను రేకెత్తించాయి.



## లోక్‌సభలో 'యార్' అన్న విపక్ష సభ్యుడు

### ప్యానెల్ స్పీకర్ మందలింపు

**న్యూఢిల్లీ:** లోక్‌సభలో ప్రతిపక్ష సభ్యుడు ఒకరు ప్యానల్ స్పీకర్‌ను ఉద్దేశించి 'యార్' అని సంభోదించడం సభలో కాస్త గందరగోళానికి కారణమైంది. భారత ఆర్మీ మాజీ చీఫ్ నరవణే రాసిన ఆత్మకథలోని అంశాలను ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మంగళవారం కూడా ప్రస్తావించారు. దీంతో లోక్ సభ కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగింది. రాహుల్ గాంధీ ప్రసంగిస్తున్న సమయంలో అధికార పార్టీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో విపక్ష సభ్యుల్లో నుంచి ఒకరు ప్యానెల్ స్పీకర్ తెన్నేటి కృష్ణప్రసాద్‌ను ఉద్దేశించి 'యార్' అని సంభోదించారు. ఇలా 'యార్' అనడం ఏమిటి... ఇది పార్లమెంట్... సభాపతి స్థానంలో ఉన్న వ్యక్తిని అలా సంభోదించడం సరికాదని ప్యానెల్ స్పీకర్ మందలించారు. అలా మాట్లాడటం సభా మర్యాదకు వ్యతిరేకమని తెలిపారు. వెంటనే మీ మాటలను వెనక్కి తీసుకోవాలని సూచించారు.

## మాకు భారత్‌తో బంధం ముఖ్యం: రష్యా



**మాస్కో:** అమెరికాతో వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో, రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేయాలని భారత్ నిర్ణయించుకున్నట్లు వస్తున్న వార్తలపై రష్యా స్పందించింది. ఈ విషయంపై భారత ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి అధికారిక సమాచారం అందలేదని రష్యా అధ్యక్ష భవనం అధికార ప్రతినిధి, పుతిన్ సన్నిహితుడు దిమిత్రి పెస్కోవ్ మంగళవారం స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనలను నిశితంగా గమనిస్తున్నామని, వాటిని విశ్లేషిస్తున్నామని ఆయన తెలిపారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లు ఆపేస్తే, భారత ఉత్పత్తులపై ఉన్న 25 శాతం సుంకాన్ని (టారిఫ్) తొలగిస్తామని అమెరికా సోమవారం ప్రకటించిన విషయం తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్ర మోదీ మధ్య జరిగిన ఫోన్ సంభాషణ తర్వాత వైట్‌హౌస్ ఈ ప్రకటన చేసింది. రష్యా చమురు కొనడం ఆపి, అమెరికా నుంచి కొనుగోళ్లు పెంచడానికి ప్రధాని మోదీ అంగీకరించారని ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో పేర్కొన్నారు. అయితే, ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో "మేడ్ ఇన్ ఇండియా ఉత్పత్తులపై సుంకం 18 శాతానికి తగ్గడం సంతోషకరం" అని మాత్రమే ప్రస్తావించారు. రష్యా చమురు గురించి ఆయన ఎలాంటి వ్యాఖ్య చేయలేదు. ఈ పరిణామాలపై పెస్కోవ్ మాట్లాడుతూ, "అమెరికా-భారత్ ద్వైపాక్షిక సంబంధాలను మేం గౌరవిస్తాం. అదే సమయంలో భారత్‌తో మా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని అభివృద్ధి చేసుకోవడానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తాం. ఇరు దేశాల సంబంధాలను అన్ని విధాలా ముందుకు తీసుకెళ్తాం" అని రష్యా ప్రభుత్వ వార్తా సంస్థ టాస్‌తో అన్నారు. ఉక్రెయిన్‌పై యుద్ధం నేపథ్యంలో రష్యాకు చమురు ఆదాయాన్ని అడ్డుకోవాలని అమెరికా ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే.

## మోదీపై ట్రంప్ ఒత్తిడి


### వాణిజ్య ఒప్పందంపై రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. దేశాన్ని ట్రంప్‌కు తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. వాణిజ్య ఒప్పందం విషయంలో అమెరికాతో రాజీపడ్డారని అన్నారు. ఆయన పార్లమెంటు వెలుపల మీడియాతో మాట్లాడుతూ, ట్రంప్ ఒత్తిడి కారణంగా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేశారని, అంతా అయ్యాక ఇప్పుడు తన ప్రతిష్ఠ మసకబారుతుందేమోనని మోదీ ఆందోళన చెందుతున్నారని అన్నారు. కొన్ని నెలలుగా నిలిచిపోయిన వాణిజ్య ఒప్పందంపై నిన్న రాత్రి సంతకం చేశారని, అకస్మాత్తుగా ఇది ఎలా ఖరారైందని ఆయన ప్రశ్నించారు. ఆయనపై తీవ్ర ఒత్తిడి ఉండటం వల్లే ఒప్పందం కుదిరిందని అన్నారు. ఎప్ స్టీన్ ఫైల్స్, అమెరికాలో వ్యాపారవేత్త అదానీపై కేసు వంటి వ్యవహారాలు దీనికి కారణమని ఆరోపించారు. ఎప్ స్టీన్ ఫైళ్లలో బయటికి రాని విషయాలు ఇంకా ఎన్నో ఉన్నాయని అన్నారు. రైతుల కష్టాన్ని, దేశాన్ని అమ్మేశారని మండిపడ్డారు. అంతకుముందు భారత ఆర్మీ మాజీ చీఫ్ నరవణే రాసిన ఆత్మకథలోని అంశాలపై లోక్‌సభలో రెండో రోజూ గందరగోళం కొనసాగింది. ప్రభుత్వం తనను సభలో మాట్లాడనివ్వలేదని రాహుల్ ఆరోపించారు. చరిత్రలో మొదటిసారి రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మాట్లాడేందుకు ఒక ప్రతిపక్ష నేతకు అనుమతి ఇవ్వలేదని మండిపడ్డారు.

# భారత భవిష్యత్తుకు శుభసూచకం

## యూఎస్-ఇండియా డీల్‌పై పీయూష్ గోయల్



**న్యూఢిల్లీ:** దేశ ప్రయోజనాల విషయంలో రాజీపడకుండా పోటీదారులతో పోలిస్తే భారత్ మెరుగైన ఒప్పందాన్ని సాధించిందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం భారత ఉజ్వల భవిష్యత్తుకు ఒక శుభసూచకమని ఆయన అన్నారు. ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న ఈ ఒప్పందాన్ని ప్రధాని మోదీ కొలిక్కి తీసుకువచ్చారని అన్నారు. ఈ విషయంలో దేశమంతా ఆయనకు అభినందనలు తెలుపుతోందని అన్నారు. ఈ ఒప్పందంతో పేదలు, రైతులు, యువత, మత్స్యకారులకు అపారమైన అవకాశాలు లభిస్తాయని అన్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై పార్లమెంటులో ప్రకటన చేద్దామని భావించానని, కానీ రాహుల్ గాంధీ నేతృత్వంలోని ప్రతిపక్షం గందరగోళ పరిస్థితులను సృష్టించిందని అన్నారు. ఈ ఒప్పందంపై దేశాన్ని తప్పుదోవ పట్టించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఒప్పందంతో మన దేశ వ్యవసాయ, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల ప్రయోజనాలను ప్రధాని మోదీ పరిరక్షించారని అన్నారు. నరేంద్ర మోదీ, ట్రంప్ మధ్య ఉన్న సత్సంబంధాల వల్లనే రెండు దేశాల మధ్య ఈ వాణిజ్య ఒప్పందం కుదిరిందని అన్నారు. సుంకాల తగ్గింపు ప్రకటన ట్రంప్ నుంచి వచ్చిందని, వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన తుది వివరాలను ఖరారు చేశాక, సంయుక్త ప్రకటన విడుదల చేస్తామని అన్నారు.



## మోదీకి ఎన్డీయే ఎంపీల సన్మానం

**న్యూఢిల్లీ:** భారత్‌తో ట్రేడ్ డీల్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఓకే చెప్పిన నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఎన్డీయే ఎంపీలు సన్మానం చేశారు. ఈ ఒప్పందం కోసం మోదీ చేసిన కృషికి గాను వారు సన్మానం చేశారు. ఈ సన్మానం సమయంలో ఎంపీలు 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం' అంటూ నినాదాలు చేశారు. పార్లమెంటు ప్రాంగణంలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాల పార్లమెంటరీ పార్టీ భేటీ జరిగింది. ఈ భేటీ నేపథ్యంలో మొదట మోదీని సన్మానించారు. అనంతరం పార్లమెంటులో ప్రతిపక్షాల విమర్శలపై స్పందనలు, పార్లమెంటులో అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రధాని మోదీ ఎంపీలకు దిశానిర్దేశనం చేశారు. కాగా, భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందానికి ఇరు దేశాలు అంగీకరించిన విషయం తెలిసిందే. భారత్‌పై ప్రతీకార సుంకాలను 18 శాతానికి తగ్గిస్తున్నామని ట్రంప్ వెల్లడించారు. ట్రంప్ ప్రకటనతో ఇప్పటిదాకా భారత్ ఉత్పత్తులపై 50 శాతం సుంకం ఉండగా ఇప్పుడు అది 18 శాతానికి తగ్గుతుంది. ఈ 50 శాతంలో రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు 25 శాతం అదనపు సుంకం కూడా ఉంది. ఇప్పుడు అదనపు సుంకాలను తొలగిస్తున్నట్లు అమెరికా తెలిపింది.

# నెలకు 50 వేలతో టెస్లా కారు!

## మోడల్ వై కారుపై ఈఎంఐ, ఎక్స్ఛేంజ్ సౌకర్యం



**న్యూఢిల్లీ:** భారత మార్కెట్లో అమ్మకాలను పెంచుకునేందుకు ఎలాన్ మస్క్‌కు చెందిన ఎలక్ట్రిక్ వాహన దిగ్గజం టెస్లా సరికొత్త ప్రణాళికతో ముందుకొచ్చింది. ఆశించిన స్థాయిలో విక్రయాలు జరగకపోవడంతో, వినియోగదారులను ఆకర్షించేందుకు ఈఎంఐ పద్ధతి, ఎక్స్ఛేంజ్ ప్రోత్సాహకాలను ప్రకటించింది. ఈ మేరకు ఢిల్లీలో కంపెనీ కీలక ప్రకటన చేసింది. వివరాల్లోకి వెళితే, టెస్లా మోడల్ వై కారును కొనుగోలు చేసేవారికి రూ.6 లక్షల డౌన్ పేమెంట్ తో, నెలకు రూ.49 వేల సులభ ఈఎంఐతో సొంతం చేసుకునే అవకాశాన్ని కల్పించింది. అంతేకాకుండా, పాత పెట్రోల్ లేదా డీజిల్ కార్లను మార్పిడి చేసుకునే వారికి రూ.3 లక్షల వరకు ప్రోత్సాహకాన్ని అందిస్తోంది. ఈ కొత్త పథకాల ద్వారా ప్రీమియం ఎలక్ట్రిక్ కార్లను ఎక్కువ మందికి అందుబాటులోకి తీసుకురావాలని కంపెనీ భావిస్తోంది. సాధారణ కార్లతో పోలిస్తే టెస్లా కారు వాడకం వల్ల ఇంధనం, నిర్వహణ ఖర్చుల రూపంలో నెలకు రూ.20 వేల వరకు ఆదా అవుతుందని కంపెనీ పేర్కొంది. దీనివల్ల నెలవారీ వాయిదా భారం వాస్తవానికి రూ.29 వేలకు తగ్గుతుందని వివరించింది. గతేడాది భారత్‌లో అడుగుపెట్టిన టెస్లా మోడల్ వై కారుకు తొలుత మంచి స్పందన లభించినా, అధిక ధర కారణంగా అమ్మకాలు మందగించాయి. గత సంవత్సరం మొత్తం మీద కేవలం 225 కార్లను మాత్రమే విక్రయించింది. ఇదే సమయంలో బీఎండబ్ల్యూ, బీవైడీ వంటి పోటీ సంస్థలు ఆకర్షణీయమైన ఫీచర్లతో కార్లను అందిస్తుండటంతో టెస్లాకు గట్టి పోటీ ఎదురైంది. ఈ నేపథ్యంలో, తమ అమ్మకాలను పెంచుకుని మార్కెట్లో స్థానాన్ని పటిష్ఠం చేసుకునేందుకు టెస్లా ఈ కొత్త చర్యలు చేపట్టింది.




## మార్చి 4 నుంచి హెచ్1బీ వీసా రిజిస్ట్రేషన్

**న్యూఢిల్లీ:** అమెరికాలో ఉద్యోగం చేయాలనుకునే విదేశీ నిపుణుల కోసం ఇచ్చే హెచ్-1బి వీసాల ప్రక్రియలో అగ్రరాజ్యం భారీ మార్పులు చేపట్టింది. 2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వీసా రిజిస్ట్రేషన్ గడువును యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ ప్రకటించింది. అయితే, ఈసారి నిబంధనలు గతంలో కంటే అత్యంత కఠినంగా మారాయి. మార్చి 4న రిజిస్ట్రేషన్ ప్రారంభించనుంది. 31న ఫలితాలు వెల్లడిస్తుంది. కాగా, ట్రంప్ ప్రభుత్వం 2025 సెప్టెంబర్‌లో తీసుకొచ్చిన కొత్త నిబంధనల ప్రకారం.. కొన్ని రకాల హై-స్కిల్డ్ పొజిషన్లకు ఎంపికైన వారు ఏకంగా 1,00,000 డాలర్ల (సుమారు రూ. 83 లక్షలు) అదనపు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ముఖ్యంగా అమెరికా వెలుపల ఉండి వీసా కోసం దరఖాస్తు చేసే వారికి ఈ భారం తప్పదు. ఇది కంపెనీలకు పెను ఆర్థిక భారంగా మారనుంది. అలాగే ప్రాథమిక రిజిస్ట్రేషన్ ఫీజును కూడా 10 డాలర్ల నుంచి 215 డాలర్లకు పెంచారు.

# మణిపూర్ నూతన సీఎంగా ఖేమ్‌చంద్ సింగ్



**న్యూఢిల్లీ:** మణిపూర్‌లో ఏడాదిగా కొనసాగుతున్న రాజకీయ అనిశ్చితికి తెరపడింది. రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా అసెంబ్లీ మాజీ స్పీకర్ యుమ్నామ్ ఖేమ్‌చంద్ సింగ్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో జరిగిన బీజేపీ శాసనసభాపక్ష సమావేశంలో ఆయనను శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నట్లు పార్టీ ప్రకటించింది. రాష్ట్రంలో జాతుల మధ్య హింస ప్రజ్వరిల్లిన నేపథ్యంలో, అప్పటి ముఖ్యమంత్రి ఎన్. బీరెన్ సింగ్ రాజీనామా చేయడంతో గతేడాది ఫిబ్రవరి 13 నుంచి మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన అమల్లో ఉన్న సంగతి తెలిసిందే. తాజాగా బీజేపీ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయంతో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. మెజారిటీ మైతీ వర్గానికి చెందిన ఖేమ్‌చంద్ సింగ్, గతంలో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేశారు. 2017, 2022 అసెంబ్లీ ఎన్నికల్లో సింగ్జమీ నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున గెలుపొందారు. ఖేమ్‌చంద్ సింగ్ శ్రీకృష్ణుని భక్తుడు. అంతేకాకుండా, సంప్రదాయ టేక్వాండో క్రీడలో 5వ డాన్ బ్లాక్ బెల్ట్ సాధించిన తొలి భారతీయుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. హింస చెలరేగిన తర్వాత ఇటీవల గిరిజన ప్రాబల్యం ఉన్న ఉఖ్రుల్, కమ్‌జోంగ్ జిల్లాల్లో పర్యటించిన తొలి మైతీ నేతగా ఆయన నిలిచారు. ముఖ్యమంత్రి ఎన్నిక ప్రక్రియ కోసం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్‌ను కేంద్ర పరిశీలకుడిగా నియమించింది. అధిష్ఠానం ఆదేశాలతో బీజేపీ, మిత్రపక్షాల ఎమ్మెల్యేలు ఢిల్లీకి చేరుకుని ఈ సమావేశంలో పాల్గొన్నారు. 60 మంది సభ్యులున్న మణిపూర్ అసెంబ్లీలో బీజేపీకి 37 మంది ఎమ్మెల్యేలు ఉండగా, మిత్రపక్షాలైన ఎన్పీపీకి ఆరుగురు, ఎన్పీఎఫ్‌కు ఐదుగురు ఎమ్మెల్యేల బలం ఉంది.



## అజిత్ పవార్ అంతిమయాత్రలో చోరీ.. ఏడుగురి అరెస్టు

**ముంబై:** విమాన ప్రమాదంలో మృతి చెందిన మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ అంత్యక్రియలు గత గురువారం బారామతి విద్యాప్రతిష్ఠాన్ మైదానంలో జరిగాయి. ఆ సమయంలో కొంతమంది దొంగలు చేతివాటం ప్రదర్శించారు. అజిత్ పవార్ అంతిమయాత్రలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. అంత్యక్రియల అనంతరం పదిహేను మంది తమ బంగారం, ఇతర ఖరీదైన వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన వస్తువుల విలువ సుమారు రూ.30 లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం ఏడుగురు అనుమానితులను పోలీసులు అరెస్టు చేశారు.

# డీల్ వెనుక సార్వభౌమాధికారం తాకట్టు!

## భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై విపక్షాల ఫైర్

**న్యూఢిల్లీ:** భారత్-అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి. దేశ సార్వభౌమాధికారం, ప్రభుత్వ పారదర్శకత, రైతుల ప్రయోజనాలు, ఇంధన భద్రత వంటి అంశాలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. భారత ప్రభుత్వం బదులుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటనలు చేయడంపై కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ నేతలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఈ ఒప్పందం వల్ల అమెరికాకే ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందని వారు ఆరోపించారు. ఈ ఒప్పందంపై సంతోషించాల్సింది ఏమీ లేదని కాంగ్రెస్ ఎంపీ సుఖ్‌దేవ్ భగత్ అన్నారు. ఐఏఎన్ఎస్ వార్తా సంస్థతో మాట్లాడుతూ, "గతంలో 3-4 శాతంగా ఉన్న టారిఫ్‌ను ఇప్పుడు 18 శాతానికి తగ్గించామని సంబరపడటం ఆశ్చర్యంగా ఉంది. మన దేశానికి సంబంధించిన వాణిజ్య ఒప్పందాల గురించి ట్రంప్ చెప్పడమేంటి? మనం ఇంకా సార్వభౌమ దేశం కాదా? ఏ దేశం నుంచి చమురు కొనాలి, ఎవరితో వ్యాపారం చేయాలో అమెరికా నిర్ణయిస్తుందా? ప్రధాని బదులు ట్రంప్ నుంచి ఇలాంటి కీలక సమాచారం రావడం దేశానికి మంచి సంకేతం కాదు" అని ఆయన వ్యాఖ్యానించారు. అమెరికా తన ప్రయోజనాలు లేకుండా ఏ ఒప్పందమూ చేసుకోదని, దీని వెనుక కచ్చితంగా రహస్య ఎజెండా ఉందని సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రామ్ గోపాల్ యాదవ్ ఆరోపించారు. "అమెరికా చాలా తెలివైన వ్యాపారి. ఆయుధాల కొనుగోలు లేదా కొన్ని మార్గాల నుంచి చమురు కొనవద్దనే ఒత్తిడి వంటివి దీని వెనుక ఉండొచ్చు. వారు బహిరంగంగా ఒప్పుకోరు కానీ, కచ్చితంగా ఏదో దాగి ఉంది" అని ఆయన అన్నారు. మరో కాంగ్రెస్ ఎంపీ జేబీ మాథర్ మాట్లాడుతూ, "వాణిజ్య ఒప్పందం అయినా, మరో ప్రకటైనా అన్నీ ట్రంపే చేస్తున్నారు. భారత్ అమెరికాకు లొంగిపోయిందా? ఈ ఒప్పందం చుట్టూ ఎన్నో అనుమానాలు అలుముకున్నాయి. వ్యవసాయ ఒప్పందాలు, రైతుల హక్కుల సంగతేంటి? రష్యా నుంచి కాకుండా వెనిజులా, అమెరికా నుంచి చమురు కొనాలనే ఒత్తిడి నిజమేనా? వీటన్నింటిపై స్పష్టత రావాలి. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నందున ప్రభుత్వం సభలో దీనిపై చర్చకు సిద్ధపడాలి" అని డిమాండ్ చేశారు. రష్యాతో భారత్‌కు ఉన్న దీర్ఘకాల సంబంధాలను దెబ్బతీసేలా అమెరికా ఒత్తిడి చేస్తోందని కాంగ్రెస్ ఎంపీ ఉజ్వల్ రామన్ సింగ్ ఆరోపించారు. తక్కువ ధరకు వస్తున్న రష్యా చమురును కాదని, ఎక్కువ ధరకు వెనిజులా నుంచి కొనాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రధాని మోదీ, అధ్యక్షుడు ట్రంప్ మధ్య ఫోన్ సంభాషణ తర్వాత సోమవారం ఈ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా భారత వస్తువులపై అమెరికా సుంకాలను 18 శాతానికి తగ్గించగా, అమెరికా ఉత్పత్తులపై భారత్ కొన్ని వాణిజ్య అడ్డంకులను సడలించింది. ఈ ఒప్పందంతో భారత ఎగుమతులకు ప్రోత్సాహం లభిస్తుందని ప్రభుత్వం చెబుతుండగా, దీనిపై పార్లమెంటులో పూర్తి వివరాలతో కూడిన ప్రకటన చేయాలని విపక్షాలు పట్టుబడుతున్నాయి.



ఈవార్తలు
# వినోదవాణి CINEMA
బుధవారం 4-2-2026 | www.evarthalu.com | 6

వయ్యారి చిత్రం




## ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్పీ వెంకటేశ్ కన్నుమూత



భారతీయ సినీ సంగీత రంగంలో మరో దిగ్గజం అస్తమించింది. తన మధురమైన స్వరాలతో దశాబ్దాల పాటు సంగీతాభిమానులను అలరించిన ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్పీ వెంకటేశ్ (70) ఇక లేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆరోగ్యం విషమించడంతో తుదిశ్వాస విడిచారు. బుధవారం చెన్నైలో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఈ వార్తతో సినీ పరిశ్రమలో విషాద వాతావరణం నెలకొంది. ఎస్పీ వెంకటేశ్ సినీ ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకం. 1971లో సాధారణ గిటారిస్ట్‌గా చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టిన ఆయన, సంగీతంపై ఉన్న అపారమైన ఆసక్తి, కృషితో ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ ఎదిగారు. ప్రముఖ సంగీత దర్శకుల వద్ద సహాయకుడిగా పనిచేసి అనుభవం సంపాదించిన తరువాత స్వతంత్ర సంగీత దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా మలయాళ చిత్ర పరిశ్రమలో ఆయన తనదైన ముద్ర వేశారు. 1990ల దశకంలో వచ్చిన అనేక బ్లాక్‌బస్టర్ చిత్రాలకు ఆయన స్వరాలు ప్రాణం పోశాయి. 'కిలిక్కం', 'ధృవం', 'కౌరవర్' వంటి చిత్రాల పాటలు నేటికీ సంగీతప్రియుల మదిలో చెరగని ముద్ర వేశాయి. తన సుదీర్ఘ కెరీర్‌లో ఎస్పీ వెంకటేశ్ మలయాళం, తమిళం, హిందీ, బెంగాలీ తదితర భాషల్లో 250కి పైగా చిత్రాలకు సంగీతం అందించారు.







## ధురంధర్ 2..
## యశ్, శేష్ సైలెంట్!

రాకింగ్ స్టార్ యష్, టాలెంటెడ్ స్టార్ అడివి శేష్ ఫైనల్‌గా వెనక్కి తగ్గుతున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. వివరాల్లోకి వెళితే.. యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో అడివి శేష్ నటిస్తున్న క్రైమ్ యాక్షన్ డ్రామా డెకాయిట్: ఏ లవ్‌స్టోరీని మార్చి 19న ఈ మూవీని రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే అది ఇప్పుడు కుదిరేలా కనిపించడం లేదు. కారణం ధురంధర్ 2:ది రివేంజ్. రణ్‌వీర్‌సింగ్ హీరోగా నటించిన ఈ మూవీని ఆదిత్యధర్ అత్యంత భారీ స్థాయిలో సాహసోపేతంగా తెరకెక్కించాడు. ఫస్ట్ పార్ట్ విమర్శల నడుమ ప్రపంచ వ్యాప్తంగా సంచలన విజయం సాధించడమే కాకుండా బాక్సాఫీస్ వద్ద రూ.1,340 కోట్లకు మించి వసూళ్లని రాబట్టి సరికొత్త రికార్డుని క్రియేట్ చేసింది. దీంతో పార్ట్ 2పై సర్వత్రా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఈ మూవీని మార్చి 19న ఐదు భాషల్లో పాన్ ఇండియా మూవీగా భారీ స్థాయిలో రిలీజ్ చేయబోతున్నారు. సినిమా రిలీజ్‌కు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో మూవీ టీమ్ మంగళవారం టీజర్‌ని విడుదల చేసింది. ఫస్ట్ పార్ట్ క్రియేట్ చేసిన అంచనాలకు మించి పార్ట్ 2 భీభత్సం సృష్టిస్తుందని క్లారిటీ రావడంతో చాలా మంది సెలబ్రిటీలు, సినీ లవర్స్, క్రిటిక్స్ ఈ మూవీ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇలాంటి మోన్‌స్టర్‌కు పోటీగా బరిలోకి దిగడం మంచిదికాదని భావంచిన అడివి శేష్ తన -డెకాయిట్: ఏ లవ్‌స్టోరీ- మూవీ రిలీజ్‌ని మార్చి 19 నుంచి పోస్ట్ పోన్ చేసినట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఇదే తరహాలో రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న -టాక్సిక్- మూవీ రిలీజ్ కూడా వాయిదా పడినట్టుగా తెలుస్తోంది.



## వరుస సినిమాలతో రాశీ ఖన్నా బిజీ

ప్రస్తుతం ఉత్తరాది దక్షిణాది సినిమాలను బ్యాలెన్స్ చేస్తూ, తెలివిగా ఆటాడుతోంది అందాల రాశీ ఖన్నా. ఈ దిల్లీ బ్యూటీ ఓవైపు ముంబైని మ్యానేజ్ చేస్తూనే, హైదరాబాద్ ని తన సొంత ఇల్లుగా మార్చుకుంది. మరోవైపు చెన్నై పరిశ్రమలోను రాశీ పేరు మార్మోగుతోంది. ఏక కాలంలో తెలుగు, తమిళం, హిందీ చిత్రాలలో నటిస్తున్న ఈ బ్యూటీ కెరీర్ పరంగా వెనుదిరిగి చూసుకోనంత బిజీగా ఉంది.

## 'మైఖేల్' జాక్సన్ ట్రైలర్ రిలీజ్




పాప్ దిగ్గజం మైఖేల్ జాక్సన్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కుతున్న బయోపిక్ 'మైఖేల్'. ఈ సినిమా ట్రైలర్‌ను తాజాగా చిత్రబృందం విడుదల చేసింది. ఈ చిత్రంలో మైఖేల్ జాక్సన్ పాత్రను ఆయన సొంత మేనల్లుడు జాఫర్ జాక్సన్ పోషిస్తున్నాడు. ట్రైలర్‌లో జాఫర్ తన నటన, డ్యాన్స్ మూమెంట్స్ మరియు బాడీ లాంగ్వేజ్‌తో అచ్చం మైఖేల్ జాక్సన్‌ను గుర్తు చేస్తూ అభిమానులను ఆశ్చర్యపరుస్తున్నాడు. ప్రముఖ దర్శకుడు ఆంటోయిన్ ఫుక్వా దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం, మైఖేల్ జాక్సన్ చిన్నతనం నుంచి గ్లోబల్ సూపర్ స్టార్‌గా ఎదిగిన ప్రయాణాన్ని, ఆయన ఎదుర్కొన్న వ్యక్తిగత సవాళ్లను తండ్రి జో జాక్సన్‌తో ఉన్న సంక్లిష్ట సంబంధాలను కళ్ళకు కట్టినట్లు చూపించబోతోంది. ఈ చిత్రం ఏప్రిల్ 24న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు సమాచారం. ఈ సినిమాలో కోల్మన్ డొమింగో, నియా లాంగ్ మైఖేల్ తల్లిదండ్రులుగా నటించగా, మైల్స్ టెల్లర్ కీలకమైన మేనేజర్ పాత్రలో కనిపించనున్నారు.

## ఎన్టీఆర్ వ్యక్తిత్వం గొప్పది: పూజా బేడీ

టాలీవుడ్ హీరో ఎన్టీఆర్‌పై బాలీవుడ్ నటి పూజా బేడీ ప్రశంసలు కురిపించారు. తామిరువురు కలిసి నటించిన శక్తి మూవీ షూటింగ్‌ను గుర్తుచేసుకుంటూ.. నటుడిని కొనియాడారు. 'బరాబర్ ప్రేమిస్తా' మూవీ ఈవెంట్‌లో.. గతంలో నటించిన తెలుగు సినిమాల ప్రస్తావన రాగా ఎన్టీఆర్ గురించి ప్రత్యేకంగా మాట్లాడారు. శక్తి సినిమాలో నేను సోనూసూద్‌కు భార్యగా నటించా. అందులో నాది నెగెటివ్ ఛాయలున్న పాత్ర. ఓ సన్నివేశంలో హీరో నాతో ఫైట్ చేయాల్సి వస్తుంది. కానీ, అందుకు ఎన్టీఆర్ నిరాకరించారు. ఎలాంటి పాత్రైనా మహిళలతో ఫైట్ చేయనన్నారు. అదీ ఆయన వ్యక్తిత్వం. అప్పుడు ఆయనపై ఇంకా గౌరవం పెరిగింది' అని పేర్కొన్నారు.






## బాలీవుడ్‌లో 'పీఆర్' బురద: రకుల్ ప్రీత్

హిందీ చిత్ర పరిశ్రమలో పీఆర్ వ్యూహాలు మరో స్థాయికి చేరాయని నటి రకుల్ ప్రీత్ సింగ్ ఆందోళన వ్యక్తం చేసింది. 'పీఆర్ వ్యవస్థలు ఒక స్థాయి వరకూ మాత్రమే పనిచేస్తాయి. మనం కష్టపడి పని చేసినప్పుడే దానికి తగిన ఫలితం వస్తుంది. గతంతో పోలిస్తే హిందీ చిత్ర పరిశ్రమలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. డబ్బు చెల్లించి ఇతరులపై బురద చల్లుతున్నారు. ఇంత నెగెటివిటీ సృష్టించే వాళ్లకు నిద్ర ఎలా పడుతుంది. వాళ్లకు మనస్సాక్షి ఉండదా అని ఎప్పుడూ అనుకుంటాను. ఇలాంటివారు ఎప్పటికైనా ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. నేను స్వయంగా ఎదిగి ఈ స్థాయికి వచ్చాను. నాకు పీఆర్ అవసరం లేదు' అని అన్నారు. ఇక ఫొటోగ్రాఫర్లపై కూడా రకుల్ అసహనం వ్యక్తంచేశారు. తాను ఒకే జీన్స్‌ను నెలకు ఐదు సార్లు వేసుకుంటానని అన్నారు. ఈ విషయాన్ని కూడా ఫొటోగ్రాఫర్లు పరిశీలిస్తున్నారని, వారికి హద్దు ఉండాలని చెప్పారు. తాను దుస్తులకు అధిక ప్రాధాన్యం ఇవ్వనని తెలిపారు.



## బుట్టబొమ్మకు అవకాశాలు!

అల వైకుంఠపురములో మూవీ తర్వాత తెలుగులో పూజాకి చెప్పుకోదగ్గ సినిమా ఒక్కటి కూడా పడలేదు. ఆ సినిమాతో టాప్ హీరోయిన్ స్థాయికి వెళ్లిన పూజా తర్వాత చేసిన సినిమాలు అనుకున్న ఫలితాన్ని ఇవ్వలేకపోయాయి. ఆచార్య లాంటి మెగా మూవీలో నటించినప్పటికీ ఆ సినిమా డిజాస్టర్ గా మిగిలింది. మరీ ముఖ్యంగా రాధే శ్యామ్ తర్వాత పూజాకు తెలుగులో ఆఫర్లు బాగా తగ్గిపోయాయి. దీంతో పూజా తన ఫోకస్ ను వేరే భాషలపై పెట్టారు. బాలీవుడ్ లో సల్మాన్ ఖాన్ లాంటి హీరోలతో కలిసి సినిమాలు చేసే అవకాశాల్ని అయితే అందుకోగలిగినా, అవి కూడా ఆమెకు నిరాశనే మిగిల్చాయి. అయితే, కోలీవుడ్‌లో మంచి అవకాశాలు దక్కించుకుంటోంది. కూలీ సినిమాలో మోనికా అనే స్పెషల్ సాంగ్ తో సూపర్ క్రేజ్ ను తెచ్చుకున్న పూజా హెగ్డే చేతిలో జననాయగన్ రిలీజ్ కు రెడీగా ఉంది. అది కాకుండా కాంచన4లో కూడా పూజా నటిస్తోంది. ఓ వైపు తమిళంలో వరుస ప్రాజెక్టులను లైన్ లో పెడుతూనే టాలీవుడ్ పై కూడా ఫోకస్ చేశారు పూజా. అందులో భాగంగానే పూజా ఆల్రెడీ దుల్కర్ సరసన ఓ క్రేజీ ప్రాజెక్టులో భాగమవగా, ఇప్పుడు అమ్మడి చేతికి మరో క్రేజీ ఆఫర్ దక్కినట్టు తెలుస్తోంది. నేచురల్ స్టార్ నాని హీరోగా సుజీత్ దర్శకత్వంలో ఓ సినిమా రానున్న విషయం తెలిసిందే. ఆ ప్రాజెక్టులో హీరోయిన్ గా పూజా హెగ్డే నటించనుందని వార్తలొస్తున్నాయి.



# సన్‌రైజర్స్‌కు షాక్!





## గాయంతో కమిన్స్ దూరం.. ఇషాన్ కిషన్‌కు పగ్గాలు!

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందే సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలేలా ఉంది. ఇప్పటికే ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 మొత్తానికి దూరమైన ఆరెంజ్ ఆర్మీ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఐపీఎల్ 2026 ఆడటంపై కూడా సందేహాలు నెలకొన్నాయి. తాను ఐపీఎల్ 2026 ఆడే విషయంపై అనిశ్చితి నెలకొందని, అందుబాటులో ఉంటానా? లేదా? అనేది ఇప్పుడే చెప్పలేనని ప్యాట్ కమిన్స్ తెలిపాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ప్యాట్ కమిన్స్.. గాయం తీవ్రత ఎక్కువగా ఉండటంతోనే టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీకి దూరమయ్యానని తెలిపాడు. 'అడిలైడ్ టెస్ట్ మ్యాచ్ తర్వాత గాయం నుంచి కోలుకోవడానికి నాలుగు నుంచి 8 వారాల సమయం పడుతుందని తెలుసు. మొదట్లో చాలా బాగున్నట్లు అనిపించడంతో నాలుగు వారాల్లో రికవరీ అవుతానని భావించా. కానీ తదుపరి స్కానింగ్ తర్వాత గాయం నుంచి పూర్తిగా కోలుకోవడానికి మరో రెండు వారాలు అవసరమని తేలింది. ఈ క్రమంలోనే టీ20 ప్రపంచకప్ 2026 ఆడే విషయంలో రిస్క్ తీసుకోలేదు. ఐపీఎల్ 2026 ఆడే విషయాన్ని కూడా ఇప్పుడే ఎటూ తేల్చలేను.'అని కమిన్స్ చెప్పుకొచ్చాడు. ఒకవేళ అతను ఐపీఎల్‌కు దూరమైతే సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో జార్ఖండ్‌కు టైటిల్ అందించిన ఇషాన్ కిషన్‌కే కెప్టెన్సీ పగ్గాలు దక్కనున్నాయి.

**సన్‌రైజర్స్ జట్టు:**

**సలీల్ అరోరా(రూ.1.50 కోట్లు), శివాంగ్ కుమార్(రూ.30 లక్షలు), క్రెయిన్స్ ఫులెట్రా(రూ.30 లక్షలు), సాకిబ్ హుస్సేన్(రూ.30 లక్షలు), ఓంకార్ తర్మలె(రూ.30 లక్షలు), ప్రఫుల్ హింగే(రూ.30 లక్షలు), అమిత్ కుమార్(రూ.30 లక్షలు), లియామ్ లివింగ్ స్టోన్(రూ.13 కోట్లు), శివమ్ మావి(రూ.75 లక్షలు), జాక్ ఎడ్వర్డ్స్(రూ.3 కోట్లు). రిటైన్ లిస్ట్: ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, అనికేత్ వర్మ, ఆర్ సమరన్, ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్, నితీష్ కుమార్ రెడ్డి, హర్ష్ దూబే, కామిందు మెండీస్, హర్షల్ పటేల్, బ్రైడన్ కార్స్, ప్యాట్ కమిన్స్, జయదేవ్ ఉనాద్కత్, ఇషాన్ మలింగా, జీషన్ అన్సారీ.**



## ద్రవిడ్ సేనే గొప్ప

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీ ప్రారంభానికి ముందు టీమిండియా మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. గత టీ20 ప్రపంచకప్ 2024లో విజేతగా నిలిచిన భారత జట్టుతో పోల్చితే ప్రస్తుత టీమ్ బలంగా ఉన్నప్పటికీ, చాలా విషయాల్లో వెనుకంజలో ఉందన్నాడు. రాహుల్ ద్రవిడ్ పర్యవేక్షణలోని రోహిత్ సేన.. ప్రస్తుత గంభీర్ పర్యవేక్షణలో సూర్య టీమ్ కంటే గొప్పదని అభిప్రాయపడ్డాడు. అధికారిక బ్రాడ్‌కాస్టర్ షోలో మాట్లాడిన అనిల్ కుంబ్లే.. రోహిత్ సేన గొప్పదని అభిప్రాయపడ్డాడు. 'అనుభవం గురించి మాట్లాడితే టీమిండియా ఇద్దరు దిగ్గజ ఆటగాళ్లను కోల్పోయింది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించారు. జట్టు సమతూకం గురించి మాట్లాడితే సూర్యసేన బలంగా ఉంది. ఎందుకంటే ఈ జట్టులో చాలా బౌలింగ్ ఆప్షన్స్ ఉన్నాయి. బ్యాటింగ్‌లో దూకుడైన అప్రోచ్‌తో భీకరంగా కనిపిస్తోంది. అయితే ఈ టోర్నీ సవాల్‌గా ఉంటుంది. 2024లో పరిస్థితులు చాలా భిన్నంగా ఉన్నాయి. ఈ జట్టు కంటే రోహిత్ సేన 10 శాతం ముందుందని చెబుతాను. 2024 టీ20 ప్రపంచకప్ ఫైనల్లో విరాట్ కోహ్లీ, అక్షర్ పటేల్ తీవ్ర ఒత్తిడిలో మెరుగైన ప్రదర్శన కనబర్చారు. తాజా టోర్నీలో అలాంటి ప్రదర్శనలు రిపీట్ కావాలి. సూర్య ఫామ్‌లో ఉండటం ముఖ్యం. క్లిష్టపరిస్థితుల్లో అతను రాణిస్తేనే భారత్ గెలుస్తుందని గ్రహించాలి' అని అభిప్రాయపడ్డాడు.


## రెండు దేశాలు.. రెండు క్రీడలు.. ఒక్కడే!

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో అరుదైన ఘట్టం ఆవిష్కృతం కానుంది. క్రికెట్ చరిత్రలోనే కనీ వినీ ఎరుగని ఘటనకు వేదికగా నిలవనుంది. ఇప్పటి వరకు ఒకే ఆటగాడు రెండు దేశాల తరఫున క్రికెట్ ఆడిన ఘటనలు చూశాం. కానీ రెండు దేశాల తరఫున వేర్వేరు క్రీడల్లో వరల్డ్ కప్‌లో పాల్గొన్న అరుదైన ఘట్టం తొలిసారి చోటు చేసుకోనుంది. 2006లో సౌతాఫ్రికా తరఫున హాకీ వరల్డ్ కప్ ఆడిన వేన్ మ్యాడ్‌సన్ 20 ఏళ్ల తర్వాత ఇటలీ కెప్టెన్‌గా టీ20 ప్రపంచకప్ 2026లో బరిలో దిగనున్నాడు. తొలిసారి ఇటలీ టీ20 ప్రపంచకప్‌కు అర్హత సాధించగా.. అతను ఆ జట్టుకు సారథ్యం వహించనున్నాడు. అతను గతంలో పీఎస్‌ఎల్, బీపీఎల్, హండ్రెడ్ లీగ్‌లోనూ ఆడాడు. ఇటలీ తరఫున 2023లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. ఇప్పటి వరకు 7 అంతర్జాతీయ టీ20లు ఆడిన వేన్ మ్యాడ్‌సన్ 34.16 సగటు, స్ట్రైక్ రేట్: 132.26తో 205 పరుగులు చేశాడు. ఇందులో రెండు హాఫ్ సెంచరీలు ఉండగా.. అత్యధిక స్కోర్ 61 నాటౌట్. దేశవాళీ క్రికెట్‌లో ఇంగ్లీష్ కౌంటీ క్రికెట్‌లో 'డెర్బీషైర్' జట్టుకు సుదీర్ఘకాలం ఆడాడు. అక్కడ టీ20 ఫార్మాట్‌లో ఒక సెంచరీ (100) కూడా నమోదు చేశాడు. 5,500 పరుగులతో డెర్బీషైర్ తరఫున అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా కొనసాగుతున్నాడు.

## మ్యాచ్ జరగకపోతేనేం?: సంజయ్ మంజ్రేకర్

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్‌తో జరిగే మ్యాచ్‌ను బాయ్‌కట్ చేస్తున్నామని పాకిస్థాన్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడం తీవ్ర చర్చనీయాంశమైంది. భారత్-పాక్ మ్యాచ్ జరగకపోతే రూ.4500 కోట్ల వ్యాపారం దెబ్బతింటుందని బిజినెస్ ఎక్స్‌పర్ట్స్ హెచ్చరిస్తుండగా.. టీమిండియా మాజీ క్రికెటర్, వివాదాస్పద కామెంటేటర్ సంజయ్ మంజ్రేకర్ మాత్రం ఈ మ్యాచ్ జరగకపోయినా ఒరిగేదేం లేదన్నాడు. పాకిస్థాన్ జట్టు ఒకప్పటిలా లేదని, బలహీనంగా మారిందని చెప్పుకొచ్చాడు. బలమైన భారత జట్టు ముందు పాకిస్థాన్ తేలిపోతుందని, ఒకప్పటిలా మ్యాచ్‌లు హోరాహోరీగా సాగడం లేదని అభిప్రాయపడ్డాడు.

## త్వరలో డబ్ల్యూపీఎల్‌లోకి సీఎస్కే!




మహిళల ప్రీమియర్ లీగ్‌లో ఐదు జట్లేనా? అని బోర్‌గా ఫీలవుతున్న అభిమానులకు గుడ్‌న్యూస్. ఈ మెగా టోర్నీలోకి త్వరలోనే మరో జట్టు రాబోతోంది. ఐపీఎల్‌లో ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ మహిళల క్రికెట్‌లో అడుగుపెట్టనుంది. ఈ విషయాన్ని మంగళవారం సీఎస్కే సీఈవో కాశీ విశ్వనాథన్ వెల్లడించాడు. రాబోయే రోజుల్లో పసుపు జెర్సీ ప్రతాపం చూపిస్తామని ఆయన పేర్కొన్నాడు. ఐపీఎల్‌తో టీ20ల్లో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన బీసీసీఐ డబ్ల్యూపీఎల్‌తో మహిళల క్రికెట్ దశను మార్చేసింది. నాలుగేళ్ల క్రితం మొదలైన ఈ లీగ్‌తో ప్రతిభావంతులైన అమ్మాయిలకు తగిన ప్రోత్సాహం, విశేష ఆదరణ లభించాయి. అయితే.. ఆరంభ సీజన్ నుంచి ఐదు జట్లే ఆడుతున్నాయి. ఐపీఎల్‌లో 10 జట్టు ఉండగా.. డబ్ల్యూపీఎల్‌లో మాత్రం ఐదేనా? అని నిట్టూర్చిన అభిమానులకు చెన్నై సూపర్ కింగ్స్ తీపి కబురు చెప్పింది. త్వరలోనే తమ జట్టును పోటీలో నిలుపుతామని సీఈవో కాశీ విశ్వనాథన్ తెలిపాడు. మీ ఫ్రాంచైజీ భవిష్యత్ ప్రణాళికలు ఏంటీ? అనే ప్రశ్నకు 'డబ్ల్యూపీఎల్‌తో మహిళల క్రికెట్‌లోకి అడుగు వేస్తున్నాం. వెంటనే కాదు కానీ, కచ్చితంగా వచ్చే సీజన్లలో సీఎస్కే డబ్ల్యూపీఎల్‌లో బరిలోకి దిగుతోంది. క్రికెట్‌తో పాటు మరికొన్ని క్రీడల్లోనూ ప్రవేశిస్తాం' అని సీఈవో కాశీ విశ్వనాథన్ పేర్కొన్నాడు.



## శ్రీలంకకు చేరుకున్న పాకిస్థాన్

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 కోసం పాకిస్థాన్ జట్టు శ్రీలంకకు చేరుకుంది. సోమవారం శ్రీలంక రాజధాని కొలంబోలో అడుగుపెట్టింది. భారత్‌తో మ్యాచ్‌ను బాయ్‌కట్ చేస్తున్నామని పాకిస్థాన్ ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఆ జట్టు రాక ప్రాధాన్యతను సంతరించుకుంది. సల్మాన్ అలీ అఘా సారథ్యంలోని పాకిస్థాన్ జట్టు మంగళవారం విశ్రాంతి తీసుకొని బుధవారం సిహళీస్ స్పోర్ట్స్ క్లబ్‌లో ఐర్లాండ్‌తో తమ ఏకైక వామప్ మ్యాచ్ ఆడనుంది. పాకిస్థాన్ జట్టు భారత్, అమెరికా, నెదర్లాండ్స్, నమీబియాతో గ్రూప్-ఏలో ఉంది. ఫిబ్రవరి 7న నెదర్లాండ్స్‌తో తొలి మ్యాచ్ ఆడనున్న పాకిస్థాన్.. ఫిబ్రవరి 10న అమెరికాతో, ఫిబ్రవరి 15న భారత్, ఫిబ్రవరి 18న నమీబియాతో ఆడనుంది.

## ఆట రానోళ్లకూ క్రికెట్ సంఘాల్లో సభ్యత్వమా?: సుప్రీం



క్రీడల్లో అనుభవం లేనివారు సంబంధిత సంఘాలను నిర్వహించడంపై సుప్రీం కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. బ్యాట్ ఎలా పట్టుకోవాలో తెలియని వారికంటే.. మాజీ ఆటగాళ్లే క్రికెట్ సంఘాలకు నాయకత్వం వహించాలని పేర్కొంది. మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ ఎన్నికలపై బాంబే హైకోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వులను ఎత్తివేయడానికి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ పంచోలీలతో కూడిన ధర్మాసనం నిరాకరించింది. వాస్తవానికి, ఈ ఏడాది జనవరి 6న ఎంసీఏ ఎన్నికలు జరగాల్సింది. అయితే, సంఘంలో దాదాపు 401 మంది సభ్యులను ఆకస్మికంగా చేర్చడం ద్వారా ఓటర్ల జాబితాను తారుమారు చేస్తున్నారని ఆరోపిస్తూ.. మాజీ క్రికెటర్, భాజపా నేత కేదార్ జాదవ్ బాంబే హైకోర్టును ఆశ్రయించారు. కొత్తగా నియమితులైన వారిలో చాలామంది ఎన్సీపీ-ఎస్పీ ఎమ్మెల్యే రోహిత్ పవార్‌కు సమీప బంధువులు, వ్యాపార భాగస్వాములే ఉన్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీంతో బాంబే హైకోర్టు ఈ ఎన్నికలపై స్టే విధించింది. దీన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీం కోర్టు ధర్మాసనం విచారించింది. 1986నుంచి 2023 వరకు ఎంసీఏలో 164 మంది సభ్యులు ఉన్నారని, ఆ తర్వాత ఈ సంఖ్యలో భారీ పెరుగుదల కనిపించిందని రికార్డులను ప్రస్తావిస్తూ ధర్మాసనం పేర్కొంది. 2023 నుంచి బంపర్ డ్రా ఏమైనా తీశారా? అని పిటిషనర్లను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ప్రశ్నించారు. ఒకవేళ అసోసియేషన్ తన మెంబర్‌షిప్‌ను విస్తరించాలనుకుంటే.. ఆ స్థానాలను మాజీ అంతర్జాతీయ ఆటగాళ్లకు కేటాయించి ఉండాల్సిందన్నారు. 'మన దేశంలో అద్భుతమైన క్రికెటర్లు ఉన్నారు. మాజీలు ఈ సభ్యత్వానికి మంచి ఎంపిక. కానీ.. ఆట గురించి ఏమాత్రం తెలియని వారిని, కనీసం బ్యాట్ ఎలా పట్టుకోవాలో అవగాహన లేని వారిని సంఘాల్లోకి తీసుకొస్తున్నారు. క్రికెటర్ల వల్లే క్రికెట్ సంఘాలు ఉన్నాయి తప్ప నిర్వాహకుల వల్ల కాదు' అని సీజేఐ వ్యాఖ్యానించారు. అనంతరం ఈ పిటిషన్లను ఉపసంహరించుకోవడానికి పిటిషనర్లను అనుమతించిన ధర్మాసనం.. బాంబే హైకోర్టుకే వెళ్లాలని సూచించింది.

## తిలక్ వర్మ ఇన్ టచ్!



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 ముందు టీమిండియా బ్యాటర్ తిలక్ వర్మ దుమ్మురేపాడు. వృషణాల శస్త్ర చికిత్సతో భారత జట్టుకు దూరమైన తిలక్ వర్మ.. పూర్తిగా కోలుకొని భారత్-ఏ తరఫున సత్తా చాటాడు. అమెరికా ప్రపంచకప్ జట్టుతో సోమవారం డీవై పాటిల్ స్టేడియం వేదికగా జరిగిన వామప్ మ్యాచ్‌లో ఆయుష్ బదోని సారథ్యంలోని భారత్-ఏ జట్టు 38 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో మూడో స్థానంలో బరిలోకి దిగిన తిలక్ వర్మ 24 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 38 పరుగులు చేశాడు. 158.33 స్ట్రైక్‌రేట్‌తో బ్యాటింగ్ చేశాడు. భారీ షాట్ ఆడే ప్రయత్నంలో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ ముందు తిలక్ వర్మ పూర్తి ఫిట్‌నెస్ సాధించి ఫామ్ కనబర్చడంపై టీమిండియా ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్-ఏ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 238 పరుగులు చేసింది. నారయణ్ జగదీషన్(55 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్స్‌లతో 104) సెంచరీతో చెలరేగగా.. కెప్టెన్ ఆయుష్ బదోని(26 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 60 నాటౌట్) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. అమెరికా బౌలర్లలో అలీ ఖాన్, జస్‌దీప్ సింగ్, శుభమ్ రంజనే తలో వికెట్ తీసారు. అనంతరం అమెరికా 19.4 ఓవర్లలో 200 పరుగులకు ఆలౌటైంది. సంజయ్ కృష్ణమూర్తి(18 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లతో 41), ఆండ్రీస్ గౌస్(31 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 44) టాప్ స్కోరర్లుగా నిలిచారు. రవి బిష్ణోయ్(3/37) మూడు వికెట్లతో సత్తా చాటగా.. నమన్ ధీర్(2/6), ఖలీల్ అహ్మద్(2/25) రెండేసి వికెట్లు తీసారు. బుధవారం రాత్రి 7.30 గంటలకు ముంబైలోని డివైపాటిల్ స్టేడియంలో భారత ప్రపంచకప్ జట్టు.. సౌతాఫ్రికా వరల్డ్ కప్ టీమ్‌తో వామప్ మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్ తరఫున కూడా తిలక్ వర్మ బరిలోకి దిగే ఛాన్స్ ఉంది. తిలక్ వర్మ రాకతో భారత తుది జట్టులో సంజూ శాంసన్ అవకాశం కోల్పోనున్నాడు. న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో ఇషాన్ కిషన్ సత్తా చాటడంతో సంజూ బెంచ్‌కే పరిమితం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
బుధవారం 4-2-2026 | www.evarthalu.com
నేటి ఈవార్తలు


# దౌత్య వ్యూహంలో మోదీ మార్కు

అంతర్జాతీయ రాజకీయ యవనికపై భారత్ తనదైన ముద్రను మరోసారి చాటిచెప్పింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని మోదీ మధ్య కుదిరిన తాజా వాణిజ్య ఒప్పందం కేవలం రెండు దేశాల మధ్య ఆర్థిక లావాదేవీలకే పరిమితం కాలేదు; ఇది మోదీ దౌత్య చతురతకు, భారత్ ఫస్ట్ అనే విదేశాంగ విధానానికి నిదర్శనం. గత కొన్ని నెలలుగా భారతీయ వస్తువులపై అమెరికా విధించిన 50 శాతం భారీ సుంకం మన ఎగుమతిదారులను కలవరపెట్టింది.



తాజా ఒప్పందంతో ఈ సుంకాన్ని 18 శాతానికి తగ్గించడం భారతీయ పరిశ్రమలకు, ముఖ్యంగా వస్త్ర, తోలు, ఆభరణాల రంగాలకు భారీ ఊరటనిచ్చింది. గరిష్ఠ సుంకాలను మోదీ ప్రభుత్వం పట్టుదలతో చర్చించి, అమెరికాను ఒప్పించగలిగిన తీరు అభినందనీయం. రష్యా నుంచి చమురు దిగుమతులపై అమెరికా ఒత్తిడి ఉన్నప్పటికీ, భారత్ తన జాతీయ ప్రయోజనాలను కాపాడుకుంటూనే ఈ ఒప్పందాన్ని కొలిక్కి తెచ్చింది. కేవలం ఒక దేశంపై ఆధారపడకుండా, అమెరికా నుంచి ఇంధన, సాంకేతిక కొనుగోళ్లను పెంచుతామని హామీ ఇవ్వడం ద్వారా చైనాకు ఒక బలమైన ప్రత్యామ్నాయంగా భారత్ తనను తాను ఆవిష్కరించుకుంది. ఈ ఒప్పందానికి కొన్ని రోజుల ముందే ఐరోపా సమాఖ్యతో మదర్ ఆఫ్ ఆల్ డీల్స్‌గా పిలిచే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయడం గమనార్హం. ఒకే వారంలో అటు యూరప్, ఇటు అమెరికాతో కీలక ఒప్పందాలు కుదుర్చుకోవడం ద్వారా ప్రపంచ ఆర్థిక శక్తిగా భారత్ ఎదుగుతున్న తీరును మోదీ ప్రభుత్వం స్పష్టం చేసింది. విమర్శలు ఎన్ని ఉన్నా, అగ్రరాజ్యాలతో సమానంగా చర్చలు జరపడం, భారత్ ప్రయోజనాల విషయంలో రాజీ పడకుండా ఒప్పందాలు సాధించడం 'మోదీ మార్కు' దౌత్యానికి అద్దం పడుతోంది.

- ఈవార్తలు సంపాదకీయ విభాగం



# జయిద్దాం.. క్యాన్సర్‌ను!

క్యాన్సర్ అనే పదం వినగానే భయపడే కాలం పోయి, అవగాహనతో దానిని జయించే రోజులు వచ్చాయి. ఫిబ్రవరి 4న జరుపుకునే ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మన సమాజంలో ఈ వ్యాధిపై చైతన్యం తీసుకురావడం ఎంతో అవసరం. క్యాన్సర్ మహమ్మారిని ఎదుర్కోవడంలో భయం కంటే అవగాహనే గొప్ప ఆయుధం.

**నేటి ఆధునిక కాలంలో క్యాన్సర్ విస్తృతి వేగంగా పెరుగుతోంది. మారుతున్న జీవనశైలి, కాలుష్యం, ఆహారపు అలవాట్లు ఈ వ్యాధికి ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. అయితే, క్యాన్సర్ అంటే మరణం అనే భావనను వీడి, సరైన సమయంలో గుర్తిస్తే మళ్లీ జీవితం అని నమ్మేలా వైద్య రంగం పురోగతి సాధించింది.**

క్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తిస్తే 90% పైగా పూర్తిగా నయం చేసే అవకాశం ఉంది. శరీరంలో అసాధారణ గడ్డలు, చర్మం రంగు మారడం, ఆకస్మిక బరువు తగ్గడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే వైద్యులను సంప్రదించాలి. 40 ఏళ్లు పైబడిన వారు మామోగ్రామ్ లేదా పాప్ స్మియర్ వంటి స్క్రీనింగ్ పరీక్షలు క్రమం తప్పకుండా చేయించుకోవడం ఎంతో మేలు. క్యాన్సర్ ఎవరికి ఎప్పుడు, ఎందుకు, ఎలా వస్తుందో చెప్పలేము. క్యాన్సర్ శరీరంలోని ఏ భాగంలోనైనా రావొచ్చు. నోరు, ఛాతి, ఊపిరితిత్తులు, గొంతు, స్వరపేటిక, రొమ్ము, శ్వాసకోశ, ప్రోస్టేట్, పేగు, జీర్ణశయ, కాలేయ క్యాన్సర్ ల వంటి దాదాపు 100కు పైగా క్యాన్సర్ రకాలు ఉన్నాయి. అయితే గడిచిన 30 సంవత్సరాల్లో ప్రపంచ వ్యాప్తంగా 50 ఏళ్ల లోపు వయస్సు గల వారిలో క్యాన్సర్ కేసులు ఏకంగా 79 శాతం పెరిగాయంటే ఈ వ్యాధి ప్రభావం ఏ మేర వ్యాపిస్తుందో అర్థం చేసుకోవచ్చు. సాధారణంగా మన శరీరంలో కణ విభజనలు ఒక క్రమ పద్ధతిలో జరుగుతాయి. అయితే, కొన్ని కారణాల వల్ల, ఆ కణాలు నియంత్రణ కోల్పోయి, చాలా వేగంగా, అనియంత్రితంగా (నియంత్రణ లేకుండా) విభజన చెంది కణ సమూహాలుగా ఏర్పడే స్థితినే క్యాన్సర్ అంటారు. ఈ కణ సమూహాలను 'కణితి' (ట్యూమర్) అని పిలుస్తారు. క్యాన్సర్ కణాలు ముందుగా స్థానిక కణజాలం పైన దాడి చేసి వాటిని నాశనం చేయడమే కాకుండా మన శరీరంలోని రక్తం, శోషరస వ్యవస్థ ద్వారా ఇతర బాగాలకు కూడా వ్యాపిస్తాయి. ఇలా వ్యాపించే క్యాన్సర్‌నే మెటాస్టాటిక్ క్యాన్సర్ అంటారు. అయితే క్యాన్సర్ బారిన పడిన చాలా మందిలో నిరక్షరాస్యత, క్యాన్సర్ పై సరైన అవగాహన లేకపోవడంతో వ్యాధి తీవ్రత పెరిగి ప్రాణాలు సైతం కోల్పోతున్నారు.



## క్యాన్సర్ రకాలు

కార్సినోమా: క్యాన్సర్‌లలో కార్సినోమాలు అత్యంత సాధారణ రకం. ఈ క్యాన్సర్ చర్మంలో లేదా శరీరం లోపలి అవయవాలని కప్పి ఉంచే కణజాలంలో ప్రారంభమవుతుంది. ఇందులో బేసల్ సెల్ కార్సినోమా, స్క్వామస్ సెల్ కార్సినోమా, ట్రాన్సిషనల్ సెల్ కార్సినోమా అనే వివిధ ఉప రకాలు ఉంటాయి.

**సార్కోమా:** కనెక్టివ్ లేదా సపోర్టివ్ టిష్యూల్లో (ఎముక, మృదులాస్థి, కొవ్వు, కండరాలు లేదా రక్త నాళాలలో) ప్రారంభమయ్యే క్యాన్సర్ ను సార్కోమా అంటారు. సార్కోమా క్యాన్సర్ లో లియోమియోసార్కోమా, కపోసి సార్కోమా, ప్రాణాంతక ఫైబరస్ హిస్టియోసైటోమా, లిపోసార్కోమా, డెర్మాటోఫైబ్రోసార్కోమా ప్రొటుబెరాన్స్ అనే ఉప రకాలు ఉంటాయి.

**లుకేమియా:** ఇది తెల్ల రక్త కణాలలో ఏర్పడే క్యాన్సర్. ఇది ఎముక మజ్జలో (బోన్ మ్యారో) రక్త కణాలను తయారు చేసే కణజాలంలో వస్తుంది.

**లింఫోమా, మైలోమా:** ఈ క్యాన్సర్‌లు రోగనిరోధక వ్యవస్థ కణాల్లోప్రారంభమవుతాయి.

**మెదడు, వెన్నుపాము క్యాన్సర్‌లు:** ఇవి కేంద్ర నాడీ వ్యవస్థలో ఉత్పన్నమయ్యే క్యాన్సర్‌లు.

**చాలా క్యాన్సర్లలో 4 దశలు ఉంటాయి. అయితే శరీరంలో కణితి స్థానం, పరిమాణం బట్టి దశ-1, దశ-2, దశ-3, దశ-4లుగా వర్గీకరించవచ్చు.**

## క్యాన్సర్‌కు కారణాలు

- వ్యాయామం, శారీరక శ్రమ లేకపోవడం
- అధిక బరువు, ఊబకాయం కలిగి ఉండటం
- రక్తంలో చెక్కర స్థాయిలు అధికంగా ఉండటం
- ఉప్పు అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవడం
- పండ్లు, పాలను తగినంతగా తీసుకోకపోవడం
- పొగాకు వాడకం, మద్యం సేవించడం


వారసత్వంగా కూడా క్యాన్సర్ వ్యాధి వచ్చే అవకాశాలున్నాయి

మన శరీర కణాలు పని చేసే విధానం, విభజన ప్రక్రియలని నియంత్రించే నిర్దిష్ట డీఎన్ఏలోని జన్యు పరమైన మార్పులు కూడా కాన్సర్‌కు కారణమవుతాయి. రేడియేషన్ ప్రభావానికి గురికావడం, పర్యావరణ కాలుష్యం కూడా క్యాన్సర్లకు దారితీస్తున్నాయి.



## క్యాన్సర్ లక్షణాలు:


- అజీర్ణం లేదా గుండెల్లో మంట.. రాత్రిళ్లు ఎక్కువ చెమట పట్టడం
- గొంతు, ముక్కు నుంచి రక్తం కారడం... దగ్గు మానకుండా రావడం
- ఊపిరి ఆడకపోవడం



- ఆకలి లేకపోవడం, అనుకోకుండా బరువు తగ్గడం
- ఆహారం మింగడంలో ఇబ్బంది పడడం, రక్త వాంతులు
- మూత్రంలో రక్తం, మూత్ర విసర్జన సమయంలో ఇబ్బంది పడటం
- శరీరంలో కొత్తగా కణితులు, పుట్టుమచ్చలు ఏర్పడటం
- నోటి లోపల చిన్నగా తెలుపు లేదా ఎరుపు బొబ్బలు రావడం
- రొమ్ములు, చనుమొలల్లో, చర్మంలో మార్పులు రావడం

## క్యాన్సర్ చికిత్సలు

ఈ మధ్య కాలంలో క్యాన్సర్‌కి అధునాతన ట్రీట్‌మెంట్ విధానాలైన కీమోథెరపీ, రేడియేషన్ థెరపీ, హార్మోన్ థెరపీ, ఇమ్యునోథెరపీ, టార్గెటెడ్ థెరపీ, బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంట్ వంటి ఉత్తమ చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. అయితే సర్జరీ సక్సెస్ రేట్ అనేది ఆ క్యాన్సర్ రకం, తీవ్రతను బట్టి ఉంటుంది. అంతేకాకుండా జన్యు పరీక్షలు, రక్త పరీక్షలు, ఇమేజింగ్, బయాప్సీలు వంటి క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా క్యాన్సర్లను గుర్తించవచ్చు. అయితే క్యాన్సర్‌కు తొలి దశలోనే చికిత్స తీసుకోవడం ద్వారా క్యాన్సర్ మరణాల్లో దాదాపు సగానికి పైగా మరణాల రేట్లను తగ్గించవచ్చు. ముఖ్యంగా ఆహారపు అలవాట్లను, జీవనశైలిని మార్చుకోవడం ద్వారా క్యాన్సర్ బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చు.




## కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం



బడ్జెట్‌లో తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం మరోసారి అన్యాయం చేసింది. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు సహా 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా రాష్ట్రానికి అన్యాయమే జరిగింది. కాంగ్రెస్ నుంచి 8 మంది ఎంపీలు ఉన్నారు. వాళ్లూ రాష్ట్ర ప్రయోజనాలు కాపాడటంలో విజయం సాధించలేదు. దేశ ఆర్థిక అభివృద్ధిలో హైదరాబాద్ గొప్ప పాత్ర పోషిస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చెప్తున్న మూసీ ప్రాజెక్టుకు గానీ, రీజినల్ రింగ్ రోడ్డుకు గానీ, మెట్రో విస్తరణకు గానీ నిధులు కేటాయించలేదు. రైల్వే ప్రాజెక్టుల్లో ఏపీకి రూ. 10,134 కోట్లు కేటాయిస్తే తెలంగాణ కేటాయించింది కేవలం రూ. 5,454 కోట్లు. కేంద్రం నుంచి వచ్చే నిధుల కన్నా, కేంద్రానికి తెలంగాణ కట్టే పన్నులే ఎక్కువ. తెలంగాణ నుంచి ప్రత్యక్ష పన్నులు, ఐజీఎస్టీ, సీజీఎస్టీ ద్వారా రూ. 4,35,919 కోట్లు వసూలు చేయగా, పన్ను వికేంద్రీకరణ, గ్రాంట్లు, పథకాలు, ఇతర బదిలీల ద్వారా రాష్ట్రానికి కేటాయింపులు మొత్తంగా రూ. 3,76,175.19 కోట్లే. అంటే.. దాదాపు 60 వేల కోట్లు తెలంగాణకు లాస్. అయినా కూడా రాబోయే ఆర్థిక సంవత్సరంలో తెలంగాణకు అవసరమైన నిధులు కేటాయించకపోవడం విచారకరం. తర్వలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌కు మాత్రం పెద్దపీట వేశారు. ఏపీకి రూ. 15 వేల కోట్ల ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. కానీ, తెలంగాణకు ప్రత్యేకంగా ఒక్క రూపాయి ప్రకటించకపోవడం దారుణం. విభజన హామీల విషయంలో ఇప్పటికే తెలంగాణపై సవతి తల్లి ప్రేమను చూపిస్తున్న కేంద్రం.. తాజా బడ్జెట్‌లోనూ తీవ్ర వివక్షను ప్రదర్శించింది.



- నవీన్ పోగుల, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.